https://epaper.dksaardyamlochaatimpu.com

E-mail: dkchaatimpu80@gmail.com RNI. NO. APTEL/2008/26737

డీకే చాటింపు


సారథ్యంలో

తెలంగాణ దిన పత్రిక

హైదరాబాద్ సంపుటి : 18 సంచిక : 22 ఎడిటర్ : పూసాల శ్రీనివాస్ ఆదివారం,అక్టోబర్,18, 2026 పేజీలు : 8 వెల : రూ.1/-



మాజీ సీఎం విజయన్ ఇంటికి
నోటీసులు అతికించిన ఈడీ



తిరువనంతపురం: కేరళం విపక్ష నేత, మాజీ సీఎం విజయన్ ఇంటికి ఇవాళ సమన్ల నోటీసును ఈడీ అతికించింది. సీఎంఆర్ఎల్‌తో లింకున్న మనీల్యాండరింగ్ కేసులో అక్టోబర్ 23వ తేదీన విచారణకు హాజరుకావాలని ఆ నోటీసులు తెలిపారు. వాస్తవానికి శుక్రవారమే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సమన్లు జారీ చేసింది. రాష్ట్ర పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఆయనపై కేసు బుక్ చేశారు. ఇక శనివారం ఉదయం కొచ్చికి చెందిన ఈడీ అధికారులు తిరువనంతపురంలోని బేకరీ జంక్షన్‌లో ఉన్న మాజీ సీఎం విజయన్ నివాసానికి వెళ్లారు. అయితే విజయన్‌కు సమన్లు అందాయన్న విషయాన్ని స్పష్టం చేయడం కోసమే ఆయన ఇంటికి వెళ్లి నోటీసులు అతికించినట్లు అధికారులు వెల్లడించారు. తాము వెళ్లినప్పుడు ఇంట్లో విజయన్ లేరని అధికారులు చెప్పారు. సీనియర్ సీపీఐ నేత వీ శివన్‌కుట్టి అక్కడకు చేరుకుని ఈడీ అధికారులకు సమాధానం ఇచ్చారు. ఈడీ చర్యలను శివన్ కుట్టి తప్పుపట్టారు. కన్నూరులో జరుగుతున్న పార్టీ మీటింగ్‌లో విజయన్ ఉన్నారని, ఆయన పారిపోలేదని అన్నారు. నిందిత వ్యక్తి ఆచూకీ లేనప్పుడు ఇంటికి నోటీసులు అతికించవచ్చు కానీ, విజయన్ టూర్‌లో ఉన్న సమయంలో వచ్చి నోటీసులు అతికించడం సమంజసం కాదు అని శివన్‌కుట్టి అన్నారు. విజయన్ కుమార్తె వీణకు కొచ్చిన్ మినరల్ అండ్ రుటైల్ లిమిటెడ్ కంపెనీ సుమారు 2.78 కోట్ల పేమెంట్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం మనుగడలో లేని ఎక్సాలాజిక్ సొల్యూషన్స్ పేరుతో ఆ అమౌంట్ ట్రాన్స్‌ఫర్ అయ్యింది.

రాజస్థాన్‌లో ఘోర ప్రమాదం..
మినీ బస్సు ప్రమాదంలో 8 మంది మృతి..



న్యూఢిల్లీ,అక్టోబర్,17: రాజస్థాన్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కోటా జిల్లాలోని ఢిల్లీ-ముంబై ఎక్స్‌ప్రెస్‌వేపై ప్రయాణికులతో వెళ్తున్న మినీ బస్సు అదుపుతప్పి లోతైన కాలువలో పడిపోయింది. ఈ ప్రమాదంలో కనీసం ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోగా, 17 మంది గాయపడ్డారు. శనివారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. మధ్యప్రదేశ్‌కు చెందిన ఓ కుటుంబ సభ్యులు ప్రయాణిస్తున్న వాహనం ప్రమాదానికి గురైంది ప్రమాదానికి గురైన మినీ బస్సులో మధ్యప్రదేశ్‌కు చెందిన కుటుంబ సభ్యులు ఉన్నారు. వీరు రాజస్థాన్‌లోని ఖాటూ శ్యామ్ ఆలయానికి వెళ్తున్నారు. ఢిల్లీ-ముంబై ఎక్స్‌ప్రెస్‌వేపై వెళ్తున్న సమయంలో మినీ బస్సు అదుపుతప్పి సుమారు 15 అడుగుల లోతున్న కాలువలో పడిపోయింది. వాహనంలో సుమారు 25 మంది ఉన్నట్లు సమాచారం. పోలీసులు, సహాయక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారుబస్సులో చిక్కుకున్న వారిని బయటకు తీసి ఆసుపత్రులకు తరలించారు గాయపడిన వారిని కోటాలోని న్యూ మెడికల్ కాలేజీ హాస్పిటల్, ఎంబీఎస్ హాస్పిటల్‌కు తరలించారు. బస్సు అదుపుతప్పడానికి గల కారణాలు ఇంకా పూర్తిగా నిర్ధారణ కాలేదు. డ్రైవర్ నిద్రమత్తులోకి వెళ్లడం లేదా వాహనం వేగంగా ప్రయాణించడం ప్రమాదానికి కారణమై ఉండవచ్చని భావిస్తున్నారు.

జమ్మూ కాశ్మీర్‌లో అక్రమ చొరబాటుకు యత్నం.. ఇద్దరు ఉగ్రవాదుల కాల్చివేత



న్యూఢిల్లీ,అక్టోబర్,17: జమ్మూ కాశ్మీర్ నుంచి ఇండియాలోకి అక్రమంగా చొరబాటుకు యత్నించిన ఇద్దరు ఉగ్రవాదులను భద్రతా దళాలు కాల్చి చంపాయి. ఈ ఘటను శుక్రవారం అర్ధరాత్రి 3.00 గంటల తర్వాత, జమ్మూ కాశ్మీర్ కుప్వారా జిల్లాలో జరిగింది. భారత్-పాక్ సరిహద్దు అయిన లైన్ ఆఫ్ కంట్రోల్ (ఎల్‌వోసీ) వద్ద, కెరాన్ సెక్టార్‌లోని, జగ్‌మండ్ ఏరియాలో శనివారం వేకువఝామున ముగ్గురు, నలుగురు వ్యక్తులు రహస్యంగా ఇండియావైపు రావడాన్ని భారత భద్రతా దళాలు గుర్తించాయి. ఈ ప్రాంతంలో గస్తీ నిర్వహిస్తుండగా.. ఎల్‌వోసీ నుంచి సరిహద్దు దాటి ఇండియాలోకి వచ్చేందుకు తీవ్రవాదులు ప్రయత్నించారు. ఈ క్రమంలో భారత భద్రతా బలగాలు వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించాయి. దీంతో ఉగ్రవాదులు కూడా మన సిబ్బందిపై కాల్పులు జరిపారు. వెంటనే స్పందించిన భారత ఆర్మీ ఎదురు కాల్పులు జరిపింది. వారిని గాలిస్తూ కాల్పులు జరపడంతో ఇద్దరు తీవ్రవాదులు ప్రాణాలు కోల్పోయారు. మిగిలిన వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. అలాగే, ఈ ప్రాంతం మొత్తం కూంబింగ్ నిర్వహిస్తున్నట్లు ఆర్మీ తెలిపింది.

గోదావరి-కావేరి లింక్‌పై కుట్ర జరుగుతోంది..
మరో నీటి ఉద్యమం మొదలు పెడతాం..

మాజీ మంత్రి హరీష్ రావు



హైదరాబాద్,అక్టోబర్,17: నవంబర్ 3న ఎన్‌బీడీఏ సమావేశం జరగబోతుందని ఎజెండా కూడా విడుదల అయింది. గోదావరి కావేరి లింక్‌ను ఈ ఎజెండాలో చేర్చుతూ అన్ని రాష్ట్రాలకు పంపించారు. ఈ విషయంలో కుట్ర జరుగుతుందని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 7వ తారీఖున చంద్రబాబు నాయుడు లేఖ రాశారని.. వారంలో ఎజెండాలో చేర్చుతూ అన్ని రాష్ట్రాలకు ఇన్విటేషన్ వచ్చిందన్నారు. చంద్రబాబు లేఖ రాయగానే కేంద్రం మీటింగ్ ఏర్పాటు చేసింది. గోదావరిని చంద్రబాబు నాయుడు కబళిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంలో బీఆర్ఎస్ లేవనెత్తే వరకు మన రాష్ట్ర నేతలకు సోయి లేదని మండిపడ్డారు. గతంలో చంద్రబాబు ప్లాన్‌లను అడ్డుకున్నామని, ఇప్పుడు గోదావరి కావేరి లింక్ పేరుతో గోదావరి జలాల్ని కబళించే కుట్ర చేస్తున్నారన్నారు. ఉద్యమ సమయంలో కేసీఆర్ పదేపదే చెప్పేవారు. ఆయన చెప్పినట్లే ఇప్పుడు జరుగుతుంది. రేవంత్ రెడ్డి గురు దక్షణ అనుకొని వదిలి పెడుతున్నాడా? అంటూ నిలదీశారు. రేవంత్‌ను ప్రజలు తరతరాల వరకు క్షమించరన్నారు. హక్కులు ఉన్నపుడే గోదావరి కృష్ణా జలాలను వదిలి వేశారు. ఇప్పుడు శాశ్వతంగా నీళ్లు రాకుండా చేస్తున్నారని మండిపడ్డారు. నీళ్ళు పైసలు పెట్టి కొనలేమని మొన్న సీఎం అన్న మాటలను గుర్తు చేశారు. అంతటి ప్రాధాన్యత ఉన్న నీళ్లను ఎందుకు వదులు కుంటున్నారని ప్రశ్నించారు. ఎల్‌నీనో వస్తుందని తెలిసినప్పుడు దేవాదుల నీళ్ళని ఎందుకు వదిలి పెట్టావు? నువ్వు వదిలి పెడితే చంద్రబాబు నాయుడు ఒడిసి పట్టుకున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో వర్షపాతం కూడా మన కంటే తక్కువ నమోదు అయిందని, అయినా అక్కడ ఎలాంటి క్రాప్ హాలిడేలు ఇవ్వలేదని మాజీ మంత్రి హరీష్ రావు తెలిపారు. “మన నీళ్లను కిందకు వదిలి నందుకు ముందు క్షమాపణ చెప్పు. చంద్రబాబు నాయుడు లేఖ తెలంగాణ హక్కులకు మరణ శాసనం లాంటిది.

తెలంగాణలో తీవ్ర కరవు,
315 మండలాల్లో కరవు ఛాయలు

- కేంద్రం తక్షణమే సాయం చేయాలని కోరిన మంత్రి తుమ్మల- రాష్ట్రవ్యాప్తంగా 23 శాతం వర్షపాత లోటు, 13 లక్షల ఎకరాల్లో తగ్గిన సాగు- పంట నష్టపోయిన రైతులకు రూ.1,986 కోట్ల సహాయ ప్యాకేజీ ప్రతిపాదన- ప్రమాదకరంగా పడిపోయిన జలాశయాల నీటిమట్టాలు



హైదరాబాద్,అక్టోబర్,17: తెలంగాణలో కరవు పరిస్థితులు తీవ్ర రూపం దాల్చాయి. ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వర్షపాతం గణనీయంగా తగ్గడంతో 315 మండలాల్లో కరవు ఛాయలు అలుముకున్నాయని రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ధారించింది. ఈ నేపథ్యంలో రాష్ట్రాన్ని తక్షణమే ఆదుకోవాలని, సూక్ష్మ సేద్యం (మైక్రో ఇరిగేషన్), మధ్యంతర పంట విత్తనాల పంపిణీకి అవసరమైన ఆర్థిక సాయం అందించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన ‘ఖేత్ బచావో అభియాన్’ వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని వ్యవసాయ సంక్షోభాన్ని ఆయన కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. మద్దతు ధరతో మొక్కజొన్న, జొన్న తదితర పంటలను 100 శాతం కొనుగోలు చేయాలని, ధరల మద్దతు పథకం కింద ఉన్న 25 శాతం కొనుగోలు పరిమితిని ఎత్తివేయాలని విజ్ఞప్తి చేశారు. రసాయన ఎరువుల ధరలు, సబ్సిడీలను హేతుబద్ధీకరించడంతో పాటు, వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పనలో ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఇదే అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన అనధికారిక క్యాబినెట్ సమావేశంలోనూ సుదీర్ఘంగా చర్చ జరిగింది. రాష్ట్రంలోని 315 మండలాల్లో కరవు పరిస్థితులు ఉన్నాయని, వాటిలో 101 మండలాల్లో తీవ్ర కరవు, 214 మండలాల్లో ఓ మోస్తరు కరవు నెలకొందని అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. పంట నష్టపోయిన రైతులకు అండగా నిలిచేందుకు రూ. 1,986.89 కోట్లతో కూడిన సహాయ ప్యాకేజీని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. గణాంకాల ప్రకారం, జూన్ 1 నుంచి సెప్టెంబర్ 30 మధ్య రాష్ట్రంలో సాధారణంగా 740.6 మి.మీ. వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, కేవలం 615.5 మి.మీ. మాత్రమే నమోదైంది. అక్టోబర్ 15 నాటికి ఈ వర్షపాత లోటు 23 శాతానికి చేరింది. దీని ప్రభావంతో గత ఏడాదితో పోలిస్తే సాగు విస్తీర్ణం 13.22 లక్షల ఎకరాలు తగ్గి, 126.06 లక్షల ఎకరాలకు పరిమితమైంది. అత్యధికంగా నల్గొండ జిల్లాలో 3.58 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. మరోవైపు, రాష్ట్రంలోని ప్రధాన జలాశయాల్లో నీటి నిల్వలు ప్రమాదకర స్థాయికి పడిపోయాయి. 466 టీఎంసీల పూర్తి సామర్థ్యానికి గాను ప్రస్తుతం కేవలం 209.45 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉంది. ఈ పరిస్థితుల్లో తాగునీటి అవసరాలకే ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని, సాగునీటి విడుదలను పరిమితం చేయాలని అధికారులు ప్రభుత్వానికి సిఫార్సు చేశారు. కరవును అధికారికంగా ప్రకటించి, కేంద్రం నుంచి గరిష్ఠంగా సాయం పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర నివేదికను సిద్ధం చేస్తోంది.

పాకిస్థాన్‌లో భారీ భూకంపం.. భారత్‌లోనూ ప్రకంపనలు



న్యూఢిల్లీ,అక్టోబర్,17: పాకిస్థాన్‌లో భారీ భూకంపం సంభవించింది. భూకంప తీవ్రత 5.8గా నమోదైంది. భూకంప కేంద్రం పాకిస్థాన్‌లోనే ఏర్పడింది. భూకంప తీవ్రత భారతదేశంలోని కొన్ని ప్రాంతాలపై కూడా ప్రభావం చూపించింది. ప్రస్తుతానికి ఎలాంటి ప్రాణనష్టం గానీ, ఆస్తి నష్టం గానీ జరగలేదు. శనివారం తెల్లవారుజామున హిమాచల్ ప్రదేశ్‌లోని సిమ్లాలో భూకంపం సంభవించింది.

ఈ భూకంప తీవ్రత 4.1గా నమోదైంది. రాష్ట్ర రాజధానికి సుమారు 130 కిలోమీటర్ల దూరంలో ఉన్న రాంపూర్ ప్రాంతంలో ఈ ప్రకంపనలు నమోదయ్యాయి. జాతీయ భూకంప శాస్త్ర కేంద్రం (నేషనల్ సెంటర్ ఫర్ సీస్మాలజీ) ప్రకారం.. ఉదయం 4:36 గంటల ప్రాంతంలో కొన్ని సెకన్ల పాటు ఈ ప్రకంపనలు సంభవించాయి.

భూకంప కేంద్రం భూమికి 10 కిలోమీటర్ల లోతులో ఉందని పేర్కొంది. భూకంపం కారణంగా ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదని రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ (ఎస్‌డిఎంఏ) పేర్కొంది.

ఎల్ నినో ఎఫెక్ట్: కరెంట్, నీళ్లు పొదుపుగా వాడాలి


- ఎల్ నినో ప్రభావంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆందోళన- విద్యుత్, నీటిని పొదుపుగా వినియోగించాలని ప్రజలకు విజ్ఞప్తి- రాష్ట్రంలో 20,000 మెగావాట్లకు చేరిన విద్యుత్ డిమాండ్- గతంలో చలిగా ఉండే అక్టోబర్‌లోనూ ఇప్పుడు ఎండల తీవ్రత - వాతావరణ మార్పుల వల్లే ఈ పరిస్థితి నెలకొందన్న భట్టి



హైదరాబాద్,అక్టోబర్,17: రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా మారిన నేపథ్యంలో, ప్రజలు విద్యుత్తు, నీటిని అత్యంత పొదుపుగా వినియోగించుకోవాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క విజ్ఞప్తి చేశారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సహజ వనరులను బాధ్యతాయుతంగా వినియోగించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆయన స్పష్టం చేశారు. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన ‘బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ అవార్డ్’ ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ, రాష్ట్రంలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితులపై ఆందోళనవ్యక్తం చేశారు. రాష్ట్రంలోవిద్యుత్ డిమాండ్ సుమారు 20,000 మెగావాట్లకు చేరుకుందని, పెరుగుతున్న ఉష్ణోగ్రతల ప్రభావంతో విద్యుత్ వినియోగం భారీగా పెరిగిందని వివరించారు.

గతంలో అక్టోబర్, నవంబర్ నెలల్లో చలి తీవ్రత అధికంగా ఉండేదని, అయితే ప్రస్తుతం వాతావరణ మార్పుల వల్ల పరిస్థితులు పూర్తిగా భిన్నంగా మారాయని ఆయన పేర్కొన్నారు. “ఒకప్పుడు చలి నుంచి రక్షణ పొందేందుకు ప్రయత్నించేవాళ్లం, కానీ నేడు ఎండల తీవ్రత నుంచి మనల్ని మనం కాపాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది” అని వ్యాఖ్యానించారు. వాతావరణంలో సంభవిస్తున్న ఈ అనూహ్య మార్పులే విద్యుత్, నీటి కొరతకు దారితీస్తున్నాయని అభిప్రాయపడ్డారు. ప్రతి ఒక్కరూ సహజ వనరుల విలువను గుర్తించి, వాటిని పొదుపుగా వినియోగించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

ఐసీయూలో మాజీ ఉపీ ప్రధాని లాల్ కృష్ణ అద్వానీ..



న్యూఢిల్లీ,అక్టోబర్,17: భారతీయ జనతా పార్టీ సీనియర్ నేత, దేశ మాజీ ఉప ప్రధాని లాల్ కృష్ణ అద్వానీ అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. ఛాతిలో ఇన్ఫెక్షన్ తలెత్తడంతో ఆయన్ను శుక్రవారం సాయంత్రం ఢిల్లీలోని అపోలో ఆస్పత్రిలో చేర్పించారు. ప్రస్తుతం ఆయన ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఐసీయూ)లో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న కేంద్ర మంత్రి జేపీ నడ్డా వెంటనే ఆస్పత్రికి వెళ్లి అద్వానీని పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

శుక్రవారం సాయంత్రం 7:30 గంటల ప్రాంతంలో 98 ఏళ్ల అద్వానీని ఆస్పత్రికి తీసుకువచ్చినట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు అపోలో ఆస్పత్రి హెల్త్ బులెటిన్ను విడుదల చేసింది. నూరాలజీ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ వినీత్ సూరి నేతృత్వంలోని వైద్యుల బృందం అద్వానీకి చికిత్స అందిస్తోందని, ప్రస్తుతం ఆయన పరిస్థితి నిలకడగా ఉందని స్పష్టం చేసింది. వైద్యులు ఎప్పటికప్పుడు ఆయన ఆరోగ్యాన్ని నిశితంగా పర్యవేక్షిస్తున్నారు. ఇదిలా ఉండగా.. కొద్ది రోజుల క్రితమే అద్వానీని ప్రధాని మోడీ కలిశారు. ప్రభుత్వ ప్రధాన పదవుల్లో మోడీ 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా, అక్టోబర్ 7న ఢిల్లీలోని ఆయన నివాసానికి వెళ్లి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ భేటీ తర్వాత ప్రధాని మోడీ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ.. దశాబ్దాల పాటు అద్వానీ అందించిన ప్రజా సేవ దేశ చరిత్రలో ఎంతో ప్రభావం చూపిందని కొనియాడారు. దేశ ప్రగతిని బలపరచడంలో ఆయన కీలక పాత్ర పోషించారని గుర్తుచేసుకున్నారు

విఠలేశ్వర మందిరంలో శతచండి యాగం

మారు మ్రోగిన ప్రాంగణం





నిజామాబాద్ ప్రతినిధి అక్టోబర్ 17(డీకే చాటింపు): బాన్సువాడ నియోజకవర్గం లోని కోటగిరి శ్రీ విఠలేశ్వర మందిరంలో సార్వజనిక దేవి నవరాత్రుల ఉస్తావాలలో భాగంగా శనివారం 23 జంటలతో సామూహిక శతచండి యాగం నిర్వహించారు. వరద్ కుమార్ , వేదాంత కృష్ణ ఘనాపాటి , రాజు మహారాజ్ మంత్రోచ్ఛరణలతో ప్రాంగణం మారుమోగింది. వివిధ గ్రామాల నుండి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.గాండ్ల శ్రీను భజన గానంతో అలరించారు. శత చండీయాగం నిర్వహించటం అత్యంత అదృష్టం కాగా,నిర్వాహకులు ఏర్పాట్లు ఘనంగా చేశారని యాగంలో పాల్గొన్న గంగాధర్ గౌడ్ ,శ్రీనివాస్,అశోక్,సత్యనారాయణ,శివాయ,సుబ్బారావు, లక్ష్మీకాంత్ హన్మగౌడ్ కొల్లూరు కిశోర్ దంపతులు అభినందించారు. శత చండీయాగం లో పాల్గొన్న 23 దంపతులకు కమిటీ తరపున లక్ష్మణ్, సిద్దు,సాయిరెడ్డి మరియు సభ్యులు శాలువాలతో సన్మానం చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు,భజన మండలి ఆధ్వర్యంలో ఆట పాటలతో ప్రాంగణం మారు మోగింది.జబర్దస్త్ టీం తో కార్యక్రమాలు ఏర్పాటు చేశామని కమిటీ సభ్యులు తెలిపారు.

బతుకమ్మ పండుగకు పటిష్ట ఏర్పాట్లు...

-మంత్రి పొన్నం ప్రభాకర్



చాటింపు, హుస్నాబాద్; హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు వద్ద బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. శనివారం హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు వద్ద బతుకమ్మ పండుగ ఏర్పాట్లను, చెరువు సుందరీకరణ పనులను, చెరువు కట్టపై నూతనంగా నిర్మిస్తున్న మైసమ్మ ఆలయ పనులను ఆయన పరిశీలించారు. బతుకమ్మ ఘాట్ మెట్ల వద్ద మాత్రమే కాకుండా, అవసరమైన చోట్ల బారికేడ్లు, లైటింగ్ ఏర్పాటు చేయాలని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా పండుగను ప్రశాంతంగా, సంతోషంగా జరుపుకునేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఆరేపల్లి చెరువు వద్ద కూడా బతుకమ్మ వేడుకల కోసం అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

హుస్నాబాద్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం..

అనంతరం మీడియాతో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. గ్లాస్ బ్రిడ్జి, కప్పగుట్ట పర్యాటక అభివృద్ధి, అర్బన్ ఫారెస్ట్ పార్క్ ఏర్పాటు వంటి కార్యక్రమాలను చేపడుతున్నట్లు, ఎల్లమ్మ చెరువుతో పాటు కొత్త చెరువు, పల్లె చెరువులను కూడా అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. హుస్నాబాద్‌ను క్రీడారంగంలో అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో కబడ్డీ అకాడమీని మంజూరు చేశామని, స్విమ్మింగ్ పూల్‌కు సంబంధించిన జీవో కూడా రానుందని అన్నారు. హుస్నాబాద్‌లో స్టేడియం ఏర్పాటు చేస్తామని, నియోజకవర్గంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని అన్నారు. మల్లెచెట్టు చౌరస్తా నుంచి రహదారి అభివృద్ధి పనులు చేపడుతున్నామని, కొత్తపల్లి –హుస్నాబాద్, హుస్నాబాద్ – జనగామ మధ్య నాలుగు వరుసల రహదారుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. విద్యారంగంలో కోహెడలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం జరుగుతోందని, శాతవాహన యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలకు భవనాల నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయని, చిగురుమామిడిలో తెలంగాణ పబ్లిక్ స్కూల్, ఎల్కతుర్తిలో ఐఐఐటీ బ్రాంచ్, వంగరలో నవోదయ పాఠశాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని, సైదాపూర్‌కు మరో పబ్లిక్ స్కూల్ మంజూరు కానుందనీ. అక్కన్నపేటలో పాఠశాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినట్లు అన్నారు.నియోజకవర్గంలో 250 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని, అక్కన్నపేట, ఎల్కతుర్తి మండలాల్లో ఎమ్మార్వో కార్యాల యాలు మంజూరయ్యాయని, ఆర్డీవో కార్యాలయానికి సంబంధించిన పెండింగ్ పనులను పూర్తి చేస్తున్నామని అన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టు పనులను వేగవంతం చేస్తున్నామని, ప్రాజెక్టు కాలువలకు సంబంధించిన భూసేకరణ పనులు కొనసాగుతున్నాయని, భూసేకరణ పూర్తయిన వెంటనే కాలువల నిర్మాణ పనులు ప్రారంభిస్తామని, ఎంఎంఆర్ ప్యాకేజీ కింద కూడా పనులు ప్రారంభమవుతాయని అన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని, పంటలు ఎండిపోకుండా ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటోందని, పంట పూర్తయ్యే వరకు రాత్రి వేళల్లో కూడా విద్యుత్ సరఫరా అందించేందుకు చర్యలు చేపడుతున్నామని అన్నారు.ప్రస్తుత నీటి నిల్వలను వచ్చే వేసవిలో తాగునీటి అవసరాలకు కూడా వినియోగించుకోవాల్సి ఉందని, అందువల్ల నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనల మేరకు పంటలు సాగు చేయాలని రైతులను కోరారు.ప్రకృతి వైపరీత్యాలు, ఎల్‌నినో ప్రభావం వంటి పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రభు త్వం అప్రమత్తంగా ఉందని, ఈ అంశాలపై కేబినెట్‌లో కూడా చర్చించినట్లు తెలిపారు. ఈ సమయంలో రాజకీయాలకు అతీతంగా రైతులకు అండగా నిలవాలని అన్ని వర్గాలకు విజ్ఞప్తి చేశారు. పల్లె పల్లెకు పొన్నం అన్న, పల్లెల్లో ప్రజా పాలన కార్యక్రమం ద్వారా గ్రామాల్లో ఇంకుడు గుంతల నిర్మాణాన్ని ప్రోత్సహిస్తున్నామని, సోలార్ విద్యుత్ వినియోగాన్ని పెంచుకోవాలని ప్రజలకు సూచిస్తున్నామని అన్నారు. గత పదేళ్లలో ఎన్ని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించి ఇచ్చారో ప్రజలకు తెలుసునని, హుస్నాబాద్ నియోజకవర్గంలో ఒక్క ఏడాదిలోనే 3,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందని, అందులో హుస్నాబాద్ పట్టణంలో 500 ఇళ్లు కేటాయించామని అన్నారు.గుడిసెల్లో నివసిస్తున్న నిరుపేద కుటుంబాలకు మొదటి ప్రాధాన్యత ఇచ్చామని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ నిష్పక్షపాతంగా ఇళ్లు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు.నియోజకవర్గంలో ఎక్కడ ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురైనా సహించేది లేదని మంత్రి హెచ్చరించారు.హుస్నాబాద్ నియోజకవర్గాన్ని పర్యాటకం, విద్య, వైద్యం, రహదారులు, సాగునీరు, క్రీడలు తదితర అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్, మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ చిత్తారి పద్మ, ఆర్డీవో రామ్మూర్తి, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు

స్నేహ సొసైటీ లో దివ్యాంగుల

పాఠశాలలో బతుకమ్మ పండుగ



నిజామాబాద్ ప్రతినిధి అక్టోబర్ 17 (డీకే చాటింపు):నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని మారుతి నగర్ లో స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీ కన్స్ట్రక్షన్ దివ్యాంగుల పాఠశాలలో స్నేహ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టార్గెట్ ఇంటర్వెన్షన్ ప్రాజెక్ట్ దివ్యాంగుల పాఠశాలలో సంయుక్తంగా తెలంగాణ రాష్ట్ర పండుగ అయిన బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు... ఈ సందర్భంగా స్నేహ సొసైటీ అందుల పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతి మరియు మానసిక దివ్యాంగుల పాఠశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరి మరియు స్నేహ టార్గెటెడ్ ఇంటర్వెన్షన్ సిబ్బంది, దివ్యాంగుల పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది అందంగా రంగు రంగుల పూలతో బతుకమ్మను పేర్చి,కుంకుమ, పసుపుతో గౌరమ్మను తయారు చేసి బతుకమ్మ పండుగ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు.. ఈ సంధర్భంగా నిర్వాహకులు ఎస్ .సిద్ధయ్య, జ్యోతి మరియు సిబ్బంది మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర పండుగ బతుకమ్మ అని మహిళలంతా భక్తిశ్రద్ధలతో జరుపుకునే పండుగ అన్నారు.. ప్రతి సంవత్సరం బతుకమ్మ పండుగ సంబరాలను ఘనంగా నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు..అయితే గతంలో బతుకమ్మ పండుగను ఉమ్మడి రాష్ట్రంలో కూడా జరుపుకున్నప్పటికి తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత ప్రత్యేకంగా రాష్ట్ర పండుగగా అధికారికంగా ప్రతి ప్రభుత్వ,ప్రైవేట్ కార్యాలయాల్లో జరుపుకోవడం జరుగుతుందన్నారు. ప్రతి ఏటా ఈ పండుగను ఘనంగా నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు..ఈ పండుగ మహిళా మణుల పండుగ అన్నారు..ఈ పండుగ ద్వారా మహిళలు, ప్రజలు, సుఖ సంతోషాలతో ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్టు వారు తెలిపారు... ఈ కార్యక్రమంలో స్నేహ టీ ఐ ప్రాజెక్ట్ సిబ్బంది అందుల ప్రత్యేక పాఠశాల సిబ్బంది మరియు మానసిక వికలాంగుల పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ధనలక్ష్మి అవతారంలో దుర్గమ్మ...

వాసవి ఆలయంలో 66,66,666 నోట్లతో అలంకరణ...





బెల్లంపల్లి (డీకే చాటింపు) పట్టణంలో దుర్గ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి.శనివారం వాసవి కన్యక పరమేశ్వరి ఆలయంలో ధనలక్ష్మి అవతారంలో దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని 66,66,666, విలువైన కరెన్సీ నోట్ల తో అలంకరించారు.ధనలక్ష్మి అవతారం లో కొలువు దిరిన అమ్మవారిని చూడటానికి భక్తులు క్యూ కట్టారు.ఈ అద్భుత అలంకరణ ఎంతో ఆకట్టు కుంది.

జిన్నారంలో జిమ్‌ను ప్రారంభించిన ఎంపీ ఈటల



మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా(డీకే చాటింపు): మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ శనివారం కీసర డివిజన్ చీర్యాల పరిధిలోని జిన్నారం కాలనీలో పర్యటించారు. అక్కడ కొత్తగా ఏర్పాటుచేసిన ఓపెన్ జిమ్‌ను ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. డివిజన్‌లో పర్యటించి అక్కడ ఉన్న సమస్యలపై స్థానిక నేతలు, ప్రజలతో కలిసి చర్చించారు. త్వరలో సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు బలరాజ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తిరుమల్, చేర్యాల మాజీ సర్పంచ్ అశోక్, జిల్లా కార్యవర్గ సభ్యుడు సత్యనారాయణ, మాజీ వార్డ్ మెంబర్లు శాలిని, ఆంజనేయులు, గ్రామ శాఖ అధ్యక్షుడు మల్లేష్, సీనియర్ లీడర్ ప్రభాకర్, జిన్నారం కాలనీ అధ్యక్షుడు సంపత్, వేణు, కిరణ్, మహేష్, కాలనీ మహిళలు పాల్గొన్నారు.

యశోద కేర్ హాస్పిటల్స్..

కొల్లంపల్లి దర్గాలో మెగా ఉచిత ఆరోగ్య శిబిరం

-ఆరోగ్య శిబిరానికి విశేష స్పందన... -రెండు వేల ఆరు వందల మందికి పైగా భక్తులకు వైద్య సేవలు... -ఉచిత పరీక్షలు,మందుల పంపిణీ... -నిపుణుల బృందంచే వైద్య సేవలు... -పలు విభాగాలకు చెందిన డాక్టర్లచే పరీక్షలు...





నారాయణపేట,(డీకే చాటింపు): నారాయణపేట మండలం కొల్లంపల్లి దర్గా వద్ద శనివారం జరిగిన సర్వమత సమ్మేళనం సందర్భంగా నారాయణపేట యశోద కేర్ హాస్పిటల్స్,ఓల్డ్ గంజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా ఉచిత ఆరోగ్య శిబిరానికి విశేష స్పందన లభించింది.ఈ శిబిరాన్ని దర్గా సాహెబ్ సజ్జాదా నషీన్ ప్రారంభించారు.ఈ శిబిరం ద్వారా మొత్తం సుమారు 2,600 మంది భక్తులకు వైద్య సేవలు అందించనట్లు నిర్వాహకులు తెలిపారు. సర్వమత సమ్మేళనానికి హాజరైన భక్తులకు వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడం,ఆరోగ్యంపై అవగాహన కల్పించడం, అవసరమైన వారికి ప్రాథమిక వైద్య సహాయం అందించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యంగా నిర్వహించారు.

ఒకే వేదికపై సమగ్ర వైద్య సేవలు

ఈ శిబిరంలో వివిధ ఆరోగ్య సమస్యలతో వచ్చిన భక్తులకు వైద్యులు పరీక్షలు నిర్వహించి,అవసరమైన వైద్య సలహాలు అందించారు.శిబిరంలో అందించిన సేవలు..ఉచిత వైద్యుల సంప్రదింపులు, ఆరోగ్య పరీక్షలు,అవసరమైన వారికి ఈసీజీ పరీక్షలు, రక్త పరీక్షలు,కండరాలు,కీళ్లు, నడుము నొప్పులకు ఫిజియోథెరపీ సేవలు,వివిధ ఆరోగ్య సమస్యలకు సంబంధించి వైద్య సలహాలు. అవసరమైన వారికి ఉచితంగా మందుల పంపిణీ. తదుపరి పరీక్షలు,చికిత్స అవసరమైన వారికి తగిన మార్గదర్శకత్వం.వైద్యుల సూచనల మేరకు అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేయడం పట్ల భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు.దర్గా సందర్శనకు వచ్చిన భక్తులకు అక్కడికక్కడే వైద్య సేవలు అందించడం పట్ల ప్రజల నుంచి మంచి స్పందన లభించింది.యశోద కేర్ హాస్పిటల్స్‌కు చెందిన వైద్యులు,సిబ్బంది సమన్వయంతో శిబిరాన్ని నిర్వహించారు.డాక్టర్ జె.నవీన్ కుమార్ రెడ్డి, (ఆర్థోపెడిక్స్, కాంప్లెక్స్ ట్రామా ఉ జాయింట్ రీప్లేస్‌మెం ట్ సర్జన్),డాక్టర్ రవీందర్ లకావత(కన్సల్టెంట్ రేడియాలజిస్ట్), డాక్టర్ రాజ్ కుమార్ మంచాల(జనరల్ ఉ లాపరోస్కోపిక్ సర్జన్),డాక్టర్ అమిత(గైనకాలజీ, ప్రసూతి వైద్యం ఉ ఇన్‌ఫెర్టిలిటీ స్పెషలిస్ట్),డాక్టర్ ప్రశాంత్ రెడ్డి (జనరల్ ఫిజీషియన్),డాక్టర్ మహేష్(ఫిజి యోథెరపిస్ట్), డాక్టర్ రుహి రిజ్వానా (యునాని వైద్య నిపుణురాలు) వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందించేందుకు... ఈ సందర్భంగా యశోద కేర్ హాస్పిటల్స్ యాజమాన్యం మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందుబాటు ధరల్లో అందించాలనే లక్ష్యంతో ఆసుపత్రి నిరంతరం కృషి చేస్తోందని తెలిపింది.గ్రామీణ ప్రాంతాలు,ఆధ్యాత్మిక కేంద్రాలకు వచ్చే భక్తులు, వైద్య సేవలు అవసరమైన ప్రజలకు వీలైనంత చేరువగా ఆరోగ్య సేవలను అందించాలనే ఉద్దేశంతో ఈ శిబిరాన్ని నిర్వహించినట్లు పేర్కొంది. శిబిరానికి విశేష సంఖ్యలో భక్తులు హాజరై వైద్య సేవలను వినియోగించుకోవడం పట్ల నిర్వాహకులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన దర్గా నిర్వాహకులు సజ్జాదా నషీన్,భక్తులు,వైద్యులు, ఆసుపత్రి సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.ప్రజల నుంచి లభించిన స్పందన తమకు మరింత ప్రోత్సాహాన్ని ఇచ్చిందని, భవిష్యత్తులోనూ ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ఇలాంటి ఉచిత ఆరోగ్య శిబిరాలను నిర్వహించేందుకు కృషి చేస్తామని యాజమాన్యం వెల్లడించింది.



డీకే చాటింపు
తెలంగాణ దిన పత్రిక
ఆదివారం,అక్టోబర్,18, 2026

సమాజానికి చీడలా..డ్రగ్స్ మహమ్మారి !

ఉడ్తా పంజాబ్... పేరుతో ఆనాడు గోలగోల జరిగింది. పంజాబ్ మాదక ద్రవ్యాలకు నిలయంగా మారింది. అక్కడ యువత పెడదారి పడుతోందని దేశవ్యాప్తంగా ఆందోళన వెల్లువెత్తింది. దీనిపై సినిమాలు వచ్చాయి. ఇప్పుడు దేశంలో ఎక్కడో ఒకచోట మాదక ద్రవ్యాలు పట్టుబడుతూనే ఉన్నాయి. ఇవన్నీ ఒక ఎత్తయితే, ఉభయ తెలుగు రాష్ట్రాల్లో గంజాయి రవాణా, మాదక ద్రవ్యాల వినియోగం ఆందోళన కలిగిస్తోంది.గంజాయి మత్తులో అనేకానేక హత్యాచారాలు జరిగాయి. ఇటీవల మదనపల్లెలో ఓ దుండగులు బాలికను హత్యాచారం చేసిన సంగతి చూశాం. మద్యం, మత్తు పదార్థాలు సమాజాన్ని చిన్నాభిన్నం చేస్తున్నా పాలకులు పట్టించుకోవడం లేదు. కఠిన చర్యలు తీసుకోవడం లేదు. దీంతో గంజాయి బ్యాచ్‌లు రెచ్చి పోతున్నాయి. నిత్యం కాపలా కాసి పట్టుకుంటున్నా గంజాయి రవాణా ఆగడం లేదు. రేవ్ పార్టీలు, ఫామ్ హౌజ్ పార్టీల్లో డ్రగ్స్ విచ్చలవిడి వినియోగం మరింత ఆందోళన కలిగిస్తోంది. ప్రజాప్రతినిధులే డ్రగ్స్ స్వీకరిస్తే సమాజానికి ఏం సందేశం ఇవ్వాలనుకుంటున్నారు. మొయినాబాద్ ఫామ్‌హౌజ్‌లో తెలంగాణ మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి, ఏలూరు ఎంపి పుట్టా మహేశ్‌లు పట్టుబడడం దారుణం కాక మరోటి కాదు. ఇలాంటి వారిని రాజకీయాల నుంచి తరిమేయాలి. ఇలాంటి వారిని ప్రజాజీవితానికి దూరం చేయాలి. మొగ్గలోనే తుంచే యాలి. ఇలాంటి వారు మళ్లీ రాజకీయ జీవితంలోకి రాకుండా కఠిన ఆంక్షలు విధించాలి. ఇలాంటి వారి వల్లనే నేర సామ్రాజ్యం విస్తరిస్తుంది. డ్రగ్స్ ఎంతటి దారుణానికైనా తెగించేలా చేస్తుంది. హైదరాబాద్ నగర శివార్లలోని మొయినాబాద్ అజీజ్ నగర్ లో గల మాజీ ఎంఎల్ఎ పైలట్ రోహిత్ రెడ్డి ఫాం హౌస్ లో జరిగిన డ్రగ్స్ పార్టీని ఈగల్, ఫోర్త్ సిటీ పోలీసులు గుట్టురట్టు చేయడం వెనుక భారీ ఆపరేషన్ కొనసాగింది. ఈ పార్టీలో ప్రముఖులు వున్నట్లు, ఇందులో డ్రగ్స్ వాడుతున్నట్లు సమాచారం అందుకున్న ఈగల్ పోలీసులు దీనిపై స్థానిక పోలీసుల సహకారంతో గత రాత్రి పది గంటల సమయంలో దాడులు చేయడం తెలిసిందే. ఈ సమయంలో అక్కడ ఒక మహిళతోపాటు 11 మంది వున్నారు. వీరంతా మద్యం మత్తులో వుండగా కొందరు డ్రగ్స్ సేవించినట్లు అనుమానాలు వుండడంతో అందరికి డ్రగ్స్ పరీక్షలు జరిపారు. ఇదే సమయంలో వాష్ రూం వద్ద చేతిలో ఎ32 కాలిబర్ రివాల్వరన్ను పట్టుకుని వుండగా అతన్ని పోలీసులు బలవంతంగా అదుపులోకి తీసుకున్నారు. అతని పేరు నమిత్ శర్మగా తేలింది. ఇతని చేతిలో వున్న రివాల్వర్ జర్మనీలో తయారైనట్లు తేలింది. ఇతనికి సమీపంలో మరో వ్యక్తి ఖాళీ తూటా పట్టుకుని వుండగా అతన్ని కూడా అదుపులోకి తీసుకున్నారు. ఇతన్ని సిల్వేరి శరత్‌కుమార్గా గుర్తించారు. ఇతని వద్ద 26 గ్రాముల కొకైన్, భారీగా మద్యం సీసాలు పట్టుబడ్డాయి. ఘటనా స్థలంలో తూటాతో పాటు మొత్తం 4 ఖాళీ తూటాలు లభ్యమయ్యాయి. రివాల్వర్ తోపాటు తూటాను, ఖాళీ తూటాలను పరీక్షల నిమిత్తం ఎఫ్ఎస్ఎల్‌కు పరీక్షల నిమి త్తం పంపారు. ఎక్కడో యూరప్, ఆఫ్రికా దేశాల్లో ఉన్న ఈ దురలవాటు మెల్లగా మనదేశంలోకి అడుగుపెట్టి ఆందోళనకు గురి చేస్తోంది. మెక్సికోలో డ్రగ్స్ మాఫియా డాన్ ఎలా నేర సామ్రాజ్యాన్ని స్థాపించాడో ఇటీవలే చూశాం. అతడిని ఎన్‌కౌంటర్ చేశారు. అలాగే ఇక్కడి నేరాలను కూడా ఆదిలోనే అదుపు చేయకపోతే సమాజానికి క్యాన్సర్‌లా పట్టిపీడిస్తుంది. 1980లో ఎల్మెంచో కాలిఫోర్నియాలో హెరాయిన్ సరఫరా చేస్తూ పోలీసులకు దొరికాడు. కొంతకాలం జైలుశిక్ష కూడా అను భవించాడు. తిరిగి మెక్సికోకి వచ్చాక కొన్నాళ్లు పోలీసుగా పనిచేశాడు. ఆపై అన్ని మెళకువలు తెలుసుకున్నాకదాన్ని వదిలిపెట్టి 2009లో తన డ్రగ్ మాఫియాకు ప్రాణం పోసాడు. అనూహ్యంగా ఆ ముఠా 2015లో 20 మంది పోలీసుల్ని తలలు నరికి చంపేసింది. అప్పట్నించిమెంచో మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ జాబితాలోకి చేరి పోయాడు. ఎల్మెంచో వద్దనున్న ఆయుధ సంపత్తి అలాంటిలాంటిది కాదు. సాయుధ వాహనాలు, రాకెట్ లాంఛర్లు, భారీ ఎత్తున ఆయుధాలను కూడా మెక్సికో సైన్యం స్వాధీన పరుచుకొంది. అతని ముఠాలో ఉన్న వాళ్లంతా కిరాయి హంతకులుగా పేరుపడిన వారే. తనకు ఎదురు తిరిగిన ప్రభుత్వాధి కారుల్ని నిర్దాక్షిణ్యంగా చంపేవాడు. ఈ ముఠా మెక్సికో సైన్యానికి సవాల్‌గా మారింది. అతడి నేర సామ్రాజ్యాన్ని పెంచిపోషించిన వారెవరో అందరికీ తెలుసు. ఇది ప్రపంచానికి ఓ గుణపాఠం కావాలి. తెలంగాణ మాజీ న క్సలైట్ నయీమ్‌ను పెంచి పోషించిందెవరో అందరికీ తెలుసు. ఇలా నేరగాళ్లను ప్రోత్సహించడం వల్ల సమాజం ఛిద్రం కాగలదని గుర్తించాలి. అందుకే నేర స్వభావం ఉన్న వారికి ఏ రూపంలోనూ సకహరించ కూడదు. భారాస మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఫాంహౌస్‌లో పట్టుబడిన ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌తో పాటు అతని స్నేహితుడు నమిత్‌శర్మల మత్తు చరిత్ర కొత్త అనుమానాలు రేకెత్తి స్తోంది. మత్తు మందులు వాడే అలవాటు వీరికి గతంలోనూ ఉన్నట్లు పోలీసులు భావిస్తున్నారు. దిల్లీ వాసి నమిత్‌శర్మ, ఏలూరు ఎంపీ మహేశ్‌ల నుంచి సేకరించిన నమూనాల్లో ఇతర మాదకద్రవ్యాల అవశేషాలు కూడా లభించడమే ఇందుకు కారణమని చెబుతున్నారు. వాస్తవానికి తాజా కేసు దర్యాప్తుతో దీనికి సంబంధం లేకపోయినప్పటికీ మత్తు మందుల సరఫరా మూలాలను గుర్తించేందుకు అవకాశం ఉంటుందన్న ఉద్దేశంతోనే పోలీసులు పాత విషయాలనూ తవ్వితీయబోతున్నారు.



కేబుల్ ఛానల్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులివ్వాలి
టీడబ్ల్యూజేఎఫ్ అధ్యక్షుడు మామిడి సోమయ్య



దేవేందర్ రెడ్డి, శుభాష్ గౌడ్, రవికుమార్, కుమారస్వామి, సుధాకర్ గౌడ్, బీజే రవికుమార్, భరత్ కుమార్, రాయపర్తి భానుప్రసాద్, పిట్ల ప్రతాప్, ఎం. కృష్ణ ప్రసాద్, బ్రహ్మం, గిరిబాబు, కళ్యాణ్ కుమార్, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

డీకే చాటింపు ప్రతినిధి,(హైదరాబాద్): తెలంగాణలో అర్హులైన కేబుల్ ఛానల్ జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డులు వెంటనే మంజూరు చేయాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన కేబుల్ ఛానల్ జర్నలిస్టులు,యాజమాన్యం ప్రతినిధులతో కలిసి సమాచార భవన్ లో ఐఅండ్ పీఆర్ కమిషనర్ ముకుంద రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా మామిడి సోమయ్య మాట్లాడుతూ, కేబుల్ ఛానల్ జర్నలిస్టులు స్థానిక ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని,అర్హత కలిగిన జర్నలిస్టులకు నిబంధనల ప్రకా రం అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వకపోవడం అన్యాయమని అన్నారు. మారుతున్న టెక్నాలజీ మేరకు కేబుల్ టీవీలతో పాటు,కొత్త టెక్నాలజీతో నడుస్తున్న ఐపీ టీవీలను కూడా ప్రభుత్వం గుర్తించి ఐపీ టీవీలకు కూడా అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని కోరారు. పెండింగ్ సమస్యలను పరిష్కరించి, కార్డుల మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కేబుల్, ఐపీ టీవీ చానల్స్ ప్రతినిధులు

మెరుగైన వైద్య సేవలు అందించాలి
- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





ఆసుపత్రికి వస్తున్న రోగులు ఏ ప్రాంతాలకు చెందినవారో గుర్తించి, ఆయా ప్రాంతాలలో త్రాగునీటి నాణ్యతను పరీక్షించడంతో పాటు వ్యాధుల వ్యాప్తికి దారితీసే పరిస్థితులను గుర్తించాలని తెలిపారు. మున్సిపల్ పరిధిలోని 10వ వార్డులో త్రాగునీటి సరఫరాకు సంబంధించి సమస్యలు ఉన్నట్లు కలెక్టర్ దృష్టికి తీసుకురావడంతో మున్సిపల్ కమిషనర్ విజయ్ కుమార్ తో వెంటనే నీటి నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రజలకు సరఫరా చేస్తున్న త్రాగునీటి నాణ్యతను నిర్ధారించేందుకు 10వ వార్డుతో పాటు పట్టణంలోని అన్ని వార్డులలోనూ నీటి నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. డెంగ్యూ కేసులు నమోదవుతున్న ప్రాంతాలను గుర్తించి, వివరాలను సమగ్రంగా పరిశీలించాలని వైద్యులకు సూచించారు. మున్సిపల్ అధికారులు అన్ని వార్డులలో త్రాగు నీటి పరీక్షలు నిర్వహించడంతో పాటు మురుగు కాలువలను పరిశుభ్రంగా ఉంచాలని, మురుగునీరు నిల్వ ఉండకుండా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. దోమల వృద్ధికి అనుకూలమైన పరిస్థితులను నివారిస్తూ, ప్రజారోగ్య పరిరక్షణకు అవసరమైన పారిశుద్ధ్య చర్యలను నిరంతరం చేపట్టాలని తెలిపారు. ప్రజలకు సురక్షితమైన త్రాగునీరు అందించడం, అంటువ్యాధుల వ్యాప్తిని అరికట్టడం, ప్రభుత్వ ఆసుపత్రులలో మెరుగైన వైద్య సేవలు అందించే విధంగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు.సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మంచిర్యాల్ (డీకే చాటింపు):ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లాలోని లక్షెట్టిపేట మండల కేంద్రంలోని 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా సందర్శించి ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, రోగుల సంఖ్య, వ్యాధుల వివరాలు, మందుల లభ్యత, త్రాగునీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ అంశాలను పరిశీలించి ఆసుపత్రికి ప్రతిరోజూ వస్తున్న రోగులు, నమోదు అవుతున్న వ్యాధులు, చికిత్స వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. దగ్గు, జలుబు, జ్వరాలతో పాటు డెంగ్యూ లక్షణాలతో వస్తున్న రోగుల వివరాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.... ఆసుపత్రిలో అవసరమైన మందులు సరిపడా అందుబాటులో ఉంచాలని, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. ఆసుపత్రిలోని ల్యాబ్‌ను సందర్శించి పరీక్షల నిర్వహణ, రోగుల వివరాల నమోదు, రిజిస్టర్ల నిర్వహణ అంశాలను పరిశీలించి, ఆసుపత్రికి వస్తున్న రోగుల వివరాలను క్రమబద్ధంగా నమోదు చేయాలని, వ్యాధులపై సమగ్ర సమాచారాన్ని అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలు, ఆహార నాణ్యత తదితర అంశాలపై ఆరా తీశారు. డెంగ్యూ లక్షణాలతో

సీనియర్ జర్నలిస్టు రఘు మృతి
-సంతాపం ప్రకటించిన టీడబ్ల్యూజేఎఫ్



హైదరాబాద్,అక్టోబర్ 16:సీనియర్ జర్నలిస్టు, RNA న్యూస్ ఏజెన్సీ చీఫ్ ఎడిటర్ అవ్వారి రఘు గారి అకాల మృతి పట్ల తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ (TWJF) ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేస్తుంది. ఆయన మృతి మీడియా రంగానికి తీరని లోటని ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య పేర్కొన్నారు. జనగామ జిల్లా బచ్చన్నపేట కు చెందిన రఘు...1986లో ఉదయం పత్రికలో సబ్ ఎడిటర్ గా కెరీర్ ప్రారంభించి, క్రిష్ణపత్రిక, వర్తమానం, నేటినిజం తదితర మీడియా సంస్థల్లో బ్యూరో చీఫ్ గా పనిచేశారని, ఆ తర్వాత ఎ౨5 లో చీఫ్ సబ్ ఎడిటర్ బాధ్యతలు నిర్వహించారని తెలిపారు.నాలుగు దశాబ్దాలుగా మీడియా రంగంలో పని చేసిన ఆయన జర్నలిస్టుల సమస్యల పై జరిగిన పలు కార్యక్రమాల్లో తమతో కలిసి పని చేశారని అన్నారు. సౌమ్యుడైన రఘు నెల రోజులుగా ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతూ, గచ్చిబౌలిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ నిన్న రాత్రి గుండెపోటుతో మృతి చెందారని, రఘు మరణం తనను ఎంతగానో కలచివేసిందని మామిడి సోమయ్య దాగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, ఈ సంధర్భంగా రఘు మృతికి సంతాపం, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

రాష్ట్రపతి భవన్,పార్లమెంట్ సందర్శించిన నారాయణపేట జిల్లా తపస్ బృందం...
-మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణకు కృతజ్ఞతలు తెలిపిన షేర్ కృష్ణారెడ్డి...



నారాయణపేట,డీకే చాటింపు): తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్)నారాయణపేట జిల్లా శాఖ ఆధ్వర్యంలో తపస్ బృందం ఢిల్లీలో భారత రాష్ట్రపతి భవనాన్ని, పార్లమెంట్ భవనం శుక్రవారం సందర్శించారు.ఈ సందర్శనలో భాగంగా రాష్ట్రపతి భవనంలోని సమావేశ మందిరం, ప్రధానమంత్రి,మంత్రిమండలి ప్రమాణ స్వీకారం చేసే మండపం,విదేశీ అధ్యక్షులు దేశానికి వచ్చినప్పుడు జరిగే ఒప్పంద గది సందర్శించి వాటి ప్రాముఖ్యతను విశ్లేషకుల ద్వారా వివరంగా తెలుసు కున్నట్లు షేర్ కృష్ణారెడ్డి తెలిపారు. భవనం యందు లోక్ సభ, రాజ్యసభ సమావేశ మందిరాలను ప్రత్యక్షంగా వీక్షించారు.ఈ సందర్భంగా తపస్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి షేర్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ అద్భుతమైన నిర్మాణశైలి,ఒక్కొక్క నిర్మాణ ప్రాముఖ్యతను తెలుసుకోవడం అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని కల్పించిన మహబూబ్నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణకు తపస్ బృందం ధన్యవాదాలు తెలియజేసింది.ఈ కార్యక్రమం లో తపస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బాల్ రాజ్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నరసింహ,రవీందర్,నర్సప్ప, గోవింద్ రెడ్డి,లక్ష్మారెడ్డి, శ్రీనివాస్,రవికుమార్, కుర్మయ్య,నర్సింగప్ప, తదితరులు పాల్గొన్నారు.

ఖేలో ఇండియా పోటీల్లో కాయకింగ్, కెనోయింగ్ క్రీడలను చేర్చాలి



డీకే చాటింపు ప్రతినిధి,(హైదరాబాద్):డిసెంబర్‌లో జరగనున్న ఖేలో ఇండియా పోటీల్లో రోయింగ్‌తో పాటు 'కాయకింగ్, కెనోయింగ్' క్రీడలను కూడా చేర్చాలని కాయకింగ్, కెనోయింగ్ అసోసియేషన్ ప్రతినిధి డాక్టర్ రుద్రవరం సునీల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సోని బాల దేవి, తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ సలహాదారు జితేందర్ రెడ్డిలను శుక్రవారం అసోసియేషన్ ప్రతినిధులతో ఆయన కలిసి వినతిపత్రం అందజేశారు.జితేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వంలో ప్రస్తుతం నిధుల కొరత ఉందని, ఈ క్రీడలను నిర్వహించాలంటే దాదాపు రూ.10 కోట్ల వరకు వ్యయం అవుతుందని తెలిపారు. అంతేకాకుండా 'సీఎం కప్' లో గెలిచిన క్రీడాకారులకు కూడా నజరానాలు ఇవ్వడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు భూపాల్, అనిల్ రాజ్, జానీతో పాటు పలువురు క్రీడాకారులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకై సీపిఎం మద్దతు కోరాం :పీసీసీ చీఫ్ మహేష్ కుమార్



డీకే చాటింపు ప్రతినిధి (హైదరాబాద్): పిసీసీ చీఫ్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ శుక్రవారం సీపీఎం నాయకులతో సమావేశమయ్యారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల విషయమై మద్దతు కోరామని,దేశంలో ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ, ఇండియా కూటమి పార్టీలన్నీ కూడా సీపీఐ, సీపీఎం ఇతర పార్టీలు కలిసికట్టుగా సర్ మీద ఉద్యమం చేసే తీరుపై చర్చించమన్నారు. రాష్ట్రీయంగా సీపీఎం, సీపీఐ మద్దతుతో నడుస్తున్న తరుణంలో, వచ్చే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ అభ్యర్థికి మద్దతు ఇవ్వాల్సిందిగా సీపిఎం నాయకులను కోరగా శనివారం జరిగే సమావేశంలో చర్చించి సానుకూలంగా స్పందిస్తామని చెప్పారని ఆయన తెలిపారు.

మాధవ్ నగర్ కాలనీలో ఘనంగా ఏడవ రోజు దేవీ నవరాత్రి పూజలు



రంగారెడ్డి జిల్లా, అక్టోబర్ 17 (డీకే చాటింపు) శరన్నవరాత్రుల సందర్భంగా మాధవ్ నగర్ కాలనీలో ఏడవ రోజు పూజా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కాలనీ అధ్యక్షులు అమల గోపాల్ ముదిరాజ్ దంపతులు, అన్నపూర్ణ బుగ్గ రాములు దంపతులు పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, కుంకుమార్చన, లలితా సహస్రనామ పారాయణంతో భక్తిశ్రద్ధల నడుమ పూజలు జరిగాయి. ఈ కార్యక్రమంలో కాలనీ మాజీ అధ్యక్షులు మునుకుంట్ల వెంకటరెడ్డి, కార్తీక్ ముదిరాజ్, దీపక్ ముదిరాజ్, లక్ష్మీబాయి, పవన్ కుమార్ ముదిరాజ్, బన్నీ ముదిరాజ్, భావేష్ కుమార్ మోగ్తాల విజయ్ కుమార్ గౌడ్ భాస్కర్ రావు శ్యామ్ అర్జున్ వంశీ యాదవ రెడ్డి మరియు భవానీలు శివాలయం టెంపుల్ ఓం నమశ్శివాయ టీం సభ్యులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.అనంతరం అమల గోపాల్ ముదిరాజ్ మాట్లాడుతూ... "దేవీ నవరాత్రి ఉత్సవాలు జరుపుకోవడం వల్ల ఇంట్లో సుఖసంతోషాలు, ఐశ్వర్యం కలుగుతాయి. చెడుపై మంచి సాధించే శక్తిని అమ్మవారు ప్రసాదిస్తుంది. నవరాత్రుల్లో అమ్మవారిని భక్తితో కొలిస్తే కోరిన కోర్కెలు నెరవేరడంతో పాటు కాలనీలో ఐకమత్యం, ఆధ్యాత్మిక చైతన్యం పెరుగుతుంది" అని అన్నారు. అనంతరం అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించడం జరిగింది

బొలీవియాలో సైనిక స్థావరంలో భారీ పేలుడు..

దక్షిణ అమెరికా దేశమైన బొలీవియాలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. రాజధాని లాపాజ్‌కు సుమారు 30 కిలోమీటర్ల దూరంలోని వియాచా మున్సిపాలిటీలో సైనిక స్థావరంలో శుక్రవారం భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో కనీసం 10 మంది మృతి చెందగా, 62 మంది గాయపడ్డారు. మృతుల సంఖ్య 10 నుంచి 15 వరకు ఉండొచ్చని స్థానిక ఆరోగ్య శాఖ డైరెక్టర్ రీటా నెబ్రాస్కా తెలిపారు. సైనిక స్థావరంలోని రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన పైరోటెక్నిక్ పదార్థాల నిల్వ ప్రాంతంలో పేలుడు సంభవించినట్లు అధికారులు తెలిపారు.

కొమ్ములు తిరిగిన గొర్రె పొట్టేళ్లతో.. దుర్గామాతకు పూజలు

-నేటి నుంచి క్షత్రియ(ఖత్రి) సామాజిక వర్గం ప్రత్యేక పూజలు... -గొర్రె పొట్టేళ్ల మాంసం,తీపి వంటకాలతో అమ్మవారికి నైవేద్యం... -కర్ణాటక రాష్ట్రం అమీన్ గాడ్,కేరూర్ నుంచి ప్రత్యేకంగా గొర్రె పొట్టేళ్లు కొనుగోలు... -గొర్రె పొట్టేళ్ల ధరలు రూ.20 వేలు నుంచి రూ.70 వేల వరకు...! -ఈనెల19న(సోమవారం) మాంసాహారంతో విందు భోజనాలు... -ఈనెల 20న(మంగళవారం) విజయదశమి... -దుర్గామాతకు విశిష్ట పూజలకు కేరాఫ్ నారాయణపేట...! డీకే చాటింపు ప్రత్యేక కథనం...









నారాయణపేట,(డీకే చాటింపు): కొమ్ములు తిరిగిన గొర్రె పొట్టేళ్లతో..దుర్గామాతను కొలిచేందుకు నారాయణపేట జిల్లాలోని క్షత్రియ(ఖత్రి),సకున్ శాలి కుటుంబాలు సన్నద్ధమయ్యాయి.మూడు రోజుల పాటు దసరా ఉత్సవాలను ఈ కుటుంబాలు ప్రతి ఏటా ఘనంగా నిర్వహించుకోవడం ఆనవాయితీ..!ఈ సామాజిక వర్గానికి అన్ని పండుగలు ఒక ఎత్తు అయితే..ఈ పండగ మాత్రం మరో ఎత్తుగా చెప్పవచ్చు..!దసరా ఉత్సవాల్లో గొర్రె పొట్టేళ్లను వధించి దుర్గామాత అమ్మ వారికి నైవేద్యాన్ని సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు.మొదటి రోజు ఈనెల18న (ఆదివారం)దుర్గాష్టమి సందర్భంగా అమ్మవారికి పూజలు నిర్వహించి తీపి వంటకాలతో నైవేద్యం సమర్పిస్తారు.ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత గొర్రెలను వధిస్తారు. సోమవారం బంధు మిత్రులకు మాంసాహారంతో కూడిన విందు భోజనాలను ఏర్పాటు చేస్తారు. మంగళవారం విజయదశమి పడగను జరుపుకుంటారు. నారాయణపేట జిల్లా కేంద్రంలో ఈ సామాజిక వర్గానికి చెందిన దాదాపు 450 కుటుంబాలు దుర్గామాతను పూజిస్తాయి. జిల్లాలోని ధన్వాడ, జాజాపూర్,ఉట్కూరు, దామరగిద్ద,కోస్గి,కోటకొండ, చిన్నపొర్ల,పెద్ద పోర్లతో పాటు కర్ణాటక రాష్ట్రంలోని గుర్మిట్కల్లో నివసించే క్షత్రియ (ఖత్రి)కుటుంబాలు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.తొమ్మిది రోజుల పాటు భక్తులు ఉపవాస దీక్షలు,ఒంటిపూట దీక్షలను పాటిస్తారు.దసరా పండుగ రోజు మంగళవారం విజయదశమి పూజలు శమీ పూజ చేసి తీపి వంటకాలతో పండుగ జరుపుకుంటారు. గొర్రె పొట్టేళ్ల ధరలు పైపైకి..!

దసరా పండుగను పురస్కరించుకొని నారాయణపేట జిల్లాలోని క్షత్రియ(ఖత్రి)కుటుంబాలు కర్ణాటక రాష్ట్రంలోని అమీన్ గాడ్,కేరూర్,యాదగిరి,షాపూర్ తదితర ప్రాంతాల నుంచి దాదాపు రూ.20 వేల నుంచి రూ.70 వేల విలువ చేసే గొర్రె పొట్టేళ్లను కొనుగోలు చేసి తీసుకొచ్చారు.ఈ విషయాన్ని పరిశీలిస్తే..ఈ ప్రాంతంలో దుర్గామాత ఉత్సవాలను క్షత్రియ(ఖత్రి)కుటుంబాలు ఏ స్థాయిలో నిర్వహిస్తారో స్పష్టమవుతుంది.

300 కిలోమీటర్ల దూరం నుంచి... నారాయణపేట నుంచి దాదాపు 300 కిలో మీటర్ల దూరంలో ఉన్న కర్ణాటక రాష్ట్రం ఆమీన్ గాడ్,కేరూర్ ప్రాంతాల్లో గొర్రె పొట్టేళ్లను కొనుగోలు చేశారు.ఈ గొర్రె పొట్టేలు దాదాపు 40 నుంచి 50 కేజీల మధ్య తూకుతుంది.ముఖ్యంగా చెవ్వు కట్ అయిన,కొమ్ము విరిగిన,ఏదైనా దెబ్బ తగిలిన పొట్టేళ్లను మాత్రం ఎట్టి పరిస్థితుల్లో ఖరీదు చేయరు. ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత గొర్రె పొట్టేళ్ళను వధించి దుర్గామాతకు నైవేద్యంగా సమర్పిస్తారు. సోమవారం మధ్యాహ్నం తర్వాత విందు భోజనాలు ఏర్పాటు చేస్తారు.అమ్మవారి పూజలో ఎంత పెద్ద గొర్రె పొట్టేలును వదిస్తే ఆ మేరకు అమ్మవారు తమ కుటుంబాన్ని చల్లగా చూస్తారని భక్తుల విశ్వాసం. ఈ నేపథ్యంలో పలువురు భక్తులు తమ ఆర్థిక పరిస్థితిని బట్టి గొర్రె పొట్టేలును కొనుగోలు చేశారు. మంగళవారం విజయ దశమి పండుగను తమ కుటుంబ సభ్యుల మధ్య వైభవంగా జరుపుకుంటారు.ఆయా కుటుంబాలు తమ కుటుంబ సభ్యులను,దూరపు బంధువులను ప్రత్యేకంగా ఆహ్వానించి విందు భోజనాలను ఏర్పాటు చేస్తారు.ఇతర ప్రాంతాల్లో నివసించే ఈ కుటుంబాలు దసరా పండుగకు మాత్రం తప్పనిసరిగా తమ గ్రామాలకు చేరుకొని దుర్గ మాత పూజా కార్యక్రమంలో పాలు పంచుకొని తమ కుటుంబ సభ్యుల మధ్య ఆనందంగా గడుపుతారు. ప్రతి ఏటా మాదిరిగానే ఈసారి కూడా దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకునేందుకు ఆయా కుటుంబాలు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసుకున్నాయి.



ఎన్.హెచ్.ఎం ఉద్యోగుల సమ్మెకు సిపిఎం మద్దతు

-నారాయణపేటలో ఐదవ రోజుకు చేరిన నిరవధిక సమ్మె...



నారాయణపేట,(డీకే చాటింపు): ఎన్.హెచ్.ఎం ఉద్యోగుల న్యాయమైన హక్కుల సాధన కోసం కొనసాగుతున్న నిరవధిక సమ్మెకు సిపిఎం నారాయణపేట జిల్లా కమిటీ శనివారం మద్దతు ప్రకటించింది.ఉద్యోగులను వెంటనే క్రమబద్ధీకరించాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, పెండింగ్ బకాయిలు చెల్లించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వెంకట్రామిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కోవిడ్ సమయంలో ప్రాణాలకు తెగించి సేవలందించిన ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా,వారి న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఎన్.హెచ్.ఎం ఉద్యోగుల పోరాటానికి సిపిఎం అండగా ఉంటుందని ఆయన తెలిపారు.

నిజామాబాద్ బస్టాండ్ లో

'బేటీ బచావో బేటీ పడావో' కార్యక్రమం

నిజామాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 17 (డీకే చాటింపు): మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల మరియు ట్రాన్స్‌జెండర్ సంక్షేమ శాఖ జిల్లా మహిళా సాధికారత కేంద్రం (ణనజుఔ) ఆధ్వర్యంలో బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా నిజామాబాద్ బస్టాండులో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా బేటీ బచావో బేటీ పడావో లోగోతో పాటు అత్యవసర సహాయ హెల్ప్‌లైన్ నంబర్లతో కూడిన హ్యాండిల్స్‌ను బస్సుల్లో ఫిట్ చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ వెంకటరమణ , జిల్లా సంక్షేమ అధికారి సౌందర్య , అర్బన్ సీడీపీఓ విజయలక్ష్మి , డిపో-ూజు వసుంధర , జిల్లా మిషన్ కోఆర్డినేటర్ స్వప్న చేతుల మీదుగా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో భాగంగా జిల్లా సంక్షేమ అధికారి సౌందర్య మాట్లాడుతూ బాలికల రక్షణ, విద్య, మహిళల భద్రతపై ప్రజల్లో అవగాహన



కల్పించడం, అత్యవసర పరిస్థితుల్లో హెల్ప్‌లైన్ నంబర్లను వినియోగించుకునేలా ప్రజలను చైతన్యపరచడం ప్రధాన ఉద్దేశం అని తెలిపారు ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా సాధికారత కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.



నిజామాబాద్ ప్రతినిధి అక్టోబర్ 17 (డీకే చాటింపు):నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగుల సమ్మె 5వ రోజు వినూత్నంగా నిరసన తెలియజేశారు నిజాంబాద్ జిల్లాలో ఆసుపత్రి సేవలు ఈరోజు టీకాలు తప్పించి పోయాయి అయినప్పటికీ అధికారులు ప్రజాప్రతినిధులు నిమ్మకు నీరెత్తినట్లు ఉన్నారని ఉద్యోగస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

అక్రమ వడ్డీ వ్యాపారులపై నిజామాబాద్ పోలీసుల మెరుపు దాడులు : పోలీస్ కమీషనర్ వెల్లడి

67 ప్రాంతాల్లో తనిఖీలు , 42 చోట్ల చెక్కులు , ప్రామిసరీ నోట్లు , బాండ్ పేపర్స్ , నగదు స్వాధీనం

అక్రమ వడ్డీ వ్యాపారాలపై కఠిన చర్యలు తప్పవు

నిజామాబాద్ ప్రతినిధి అక్టోబర్ 17 (డీకే చాటింపు): నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నిజామాబాదు , ఆర్మూర్ , బోధన్ డివిజన్ పరిధిలో ప్రజలను అధిక వడ్డీల పేరుతో ఇబ్బందులకు గురిచేస్తూ , అక్రమంగా వడ్డీ వ్యాపారాలు నిర్వహిస్తున్న వారిపై పోలీస్ శాఖ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసింది. నిజామాబాదు పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, ఆదేశాల మేరకు శనివారం నిజామాబాద్ , ఆర్మూర్ , బోధన్ పోలీస్ డివిజన్ల పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ఉదయం నుండి పోలీసులు విస్తృతంగా మెరుపు దాడులు నిర్వహించారు. ఈ ప్రత్యేక తనిఖీల్లో భాగంగా పోలీసు అధికారులు , సిబ్బంది సంబంధిత వడ్డీ వ్యాపారుల ఇళ్లతో పాటు అనుమానిత ప్రదేశాల్లో తనిఖీలు చేపట్టారు. కమిషనరేట్ పరిధిలో మొత్తం 67 ప్రాంతాల్లో మెరుపు దాడులు నిర్వహించగా , 42 ప్రాంతాల్లో చెక్కులు, ప్రామిసరీ నోట్లు , నగదు తదితర వస్తువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అక్రమ వడ్డీ వ్యాపారాలకు సంబంధించిన ఆధారాలపై పోలీసులు పరిశీలన చేపట్టి , నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకు నేందుకు చర్యలు చేపట్టారు.

పోలీస్ కమిషనర్ హెచ్చరిక

పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, మాట్లాడుతూ ప్రజల ఆర్థిక ఇబ్బందులను ఆసరాగా చేసుకొని అధిక వడ్డీలు వసూలు చేస్తూ , అప్పులు తీసుకున్న వారిని వేధింపులకు గురిచేసే అక్రమ వడ్డీ వ్యాపారులపై పోలీస్ శాఖ కఠినంగా వ్యవహరి స్తుందని స్పష్టం చేశారు. చట్టవిరుద్ధమైన వడ్డీ వ్యాపారాలకు అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా ప్రత్యేక తనిఖీలు , దాడులు నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు.



అప్పుల పేరుతో ప్రజలను బెదిరిం చడం , బలవంతంగా చెక్కులు లేదా ఇతర పత్రాలు తీసుకోవడం , చట్టవిరుద్ధంగా అధిక వడ్డీలు వసూలు చేయడం వంటి చర్యలకు పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు ఇటువంటి అక్రమ కార్యకలాపాలకు భయపడ కుండా పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే అక్రమ వడ్డీ వ్యాపారాలపై పోలీస్ శాఖ ఉక్కుపాదం మోపు తుందని , బాధితులకు న్యాయం జరిగేలా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీస్ కమిషనర్ స్పష్టం చేశారు.అక్రమ వడ్డీ వ్యాపారులు లేదా అధిక వడ్డీల పేరుతో వేధింపులకు పాల్పడు తున్న వ్యక్తుల గురించి సమాచారం తెలిసినా, బాధితులుగా ఉన్నా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించి ఫిర్యాదు చేయాలని పోలీస్ శాఖ సూచించింది.

ఆధార్ సేవా కేంద్రం ఏర్పాటుతో

స్థానికంగానే మరింత మెరుగైన సేవలు

ప్రారంభోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ ఇలా ఆత్రిపాఠి

నిజామాబాద్ప్రతినిధి, అక్టోబర్ 17(డీకే చాటింపు): ఆధార్ సేవా కేంద్రం ద్వారా ప్రజలకు స్థానికంగానే మరింత మెరుగైన సేవలు లభిస్తాయని కలెక్టర్ ఇలా త్రిపాఠి వెల్లడించారు. నిజామాబాద్ నగరంలోని కోటగల్లి మున్నూరుకాపు సంఘం భవనంలో భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ) ఆధ్వర్యంలో నూతనంగా నెలకొల్పిన ఆధార్ సేవా కేంద్రాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి శనివారం జ్యోతి ప్రజ్వలన చేసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆధార్ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు, ఆధార్‌కు సంబంధించిన వివిధ సేవలను సులభంగా, పారదర్శకంగా అందించాలనే ఉద్దేశంతో ఆధార్ సేవా కేంద్రాల విస్తరించడం జరుగుతోందని తెలిపారు. ఇదివరకు ఆధార్ సేవల కోసం హైదరాబాద్ కు వెళ్లాల్సి వచ్చేదని, ప్రస్తుతం నిజామాబాద్ సహా తెలంగాణలో 10 ప్రాంతాలలో ఆధార్ సేవా కేంద్రాలను కొత్తగా అందుబాటులోకి తెచ్చారని అన్నారు. దీనివల్ల ప్రజలు ఆధార్‌కు సంబంధించిన సేవల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, స్థానికంగానే సేవలు పొందేందుకు ఇవి ఉపయోగపడతాయని అన్నారు. ఆధార్ సేవా కేంద్రం ద్వారా కొత్త ఆధార్ నమోదు, ఆధార్ కార్డులో వివరాల సవరణ, చిరునామా మార్పు, పేరు, పుట్టిన తేదీ వంటి వివరాల్లో అర్హత మేరకు మార్పులు చేసుకునే వెసులుబాటు కలిగిందన్నారు. ఆధార్ సేవల కోసం కేంద్రానికి వచ్చే ప్రజలు తమ వెంట అవసరమైన గుర్తింపు, చిరునామా, జనన తేదీ ధ్రువీకరణ పత్రాలను సంబంధిత సేవకు అనుగుణంగా తీసుకురావాలని తెలిపారు. వివిధ సేవలకు సంబంధించి యూఐడీఏఐ నిర్దేశించిన నిర్ణీత రుసుము మాత్రమే చెల్లించాలని సూచించారు. నిజామాబాద్ లో నూతన ఆధార్ సేవా కేంద్రం అందుబాటులోకి రావడం వల్ల నగర ప్రజలతో పాటు పరిసర ప్రాంతాల వారికి కూడా ఆధార్ సంబంధిత సేవలు పొందడంలో సౌలభ్యం ఏర్పడిందని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, బ్యాంకింగ్, వివిధ సేవల కోసం ఆధార్ వివరాలు అవసరం అవుతున్న దృష్ట్యా,



ప్రజలు తమ ఆధార్ సమాచారాన్ని సక్రమంగా ఉండేలా చూసుకోవాలని కలెక్టర్ సూచించారు. అవసరమైన సేవల కోసం నూతన ఆధార్ సేవా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఆధార్ ప్రాధికార సంస్థ హైదరాబాద్ ప్రాంతీయ అధికారి శ్రవణ్, ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ కార్తీక్ కుమార్, ఆధార్ సేవా కేంద్రం ఆపరేషనల్ మేనేజర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.


సీఎం రేవంత్ రెడ్డి ఆఖరి అస్త్రం.. గులాబీ బాస్ కొత్తవ్యూహం ఏమిటి..?



మెదక్, : కేసీఆర్ సభకు వస్తారు. కానీ సీఎంగానే అసెంబ్లీలో అడుగు పెడుతారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పిన మాట ఇది. చిల్లర మాటలు మాట్లాడే వారి ముందుకొచ్చి తాను సభలో పాల్గొనాలా.? అంటూ గులాబీ బాస్ కూడా సభకు రాబోనని తేల్చి చెప్పేశారు. ఇన్నాళ్లు సీఎం రేవంత్‌రెడ్డి ఎన్ని డిమాండ్లు చేసినా..ఎన్ని ఎత్తులు వేసినా..ప్రతిపక్ష నేత కేసీఆర్‌ను అసెంబ్లీకి రప్పించేందుకు చేసిన ప్రయత్నాలేవి ఫలించలేదు. అందుకే సీఎం రేవంత్‌రెడ్డి ఆఖరి అస్త్రాన్ని బయటికి తీశారన్న ప్రచారం నడుస్తోంది. ఎలాగైనా కేసీఆర్ నోరు తెరిపించాలి.. ఆయనతో వివరణ ఇప్పించాలనేదే రేవంత్ టార్గెట్ అని..అందుకోసం ఏ అవకాశాన్ని ఆయన వదులుకోవడం లేదంటున్నారు.ఆ మాట కొస్తే కొత్త కొత్త పొలిటికల్ వెపన్స్‌ను బయటికి తీస్తూ కేసీఆర్‌ను టార్గెట్ చేస్తున్నారు. ఇప్పుడు ఆయన ఫాంహౌస్ ల్యాండ్స్‌లో దళితుల భూమి ఉందంటూ ఏకంగా విచారణకు ఆదేశించారు. ఆల్రెడీ ఎంక్వైరీ జరుగుతోంది. రెవెన్యూ అధికారులు ఫీల్డ్ విజిట్ కూడా చేశారు. అదంతా అడ్మినిస్ట్రేషన్ ప్రాసెస్ కాగా .. కాంగ్రెస్ ఎంపీలు కేసీఆర్ ఫాంహౌస్ పరిశీలనకు వెళ్లడం మరో రాజకీయ ఎత్తుగడ అన్న టాక్ నడుస్తోంది. ఎంపీలు వెళ్లి అక్కడ చేసేదేం లేదని..జస్ట్ మీడియాలో హైప్ కోసం..కేసీఆర్ ఆస్తులు సంపాదించారని ఎక్స్‌పోజ్ చేసే ఎజెండాలో భాగంగానే ఫాంహౌస్ పర్యటన పెట్టుకున్నారని అంటున్నారు.ప్రతీసారి వన్స్ మోర్ అంటూ కేసీఆర్‌కు ఓపెన్ ఛాలెంజ్ చేస్తూ వస్తున్నారు సీఎం రేవంత్ రెడ్డి. పదేళ్ల పాలనలో తెలంగాణకు బీఆర్ఎస్ ఏం చేసిందో..కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్లలో ఏం జరిగిందో..అసెంబ్లీలో ప్రజల ముందే చర్చిద్దామంటూ ఆ మధ్య సవాల్ చేశారు రేవంత్. చర్చలో తాను ఓడిపోతే ప్రజలకు క్షమాపణ చెబుతానని..కేసీఆర్ ఓడిపోతే ఫాంహౌస్‌కే పరిమితం అవుతారా అని ఛాలెంజ్ చేసిన సందర్భాలున్నాయి. కేసీఆర్ సభకు వస్తే ఆయన గౌరవానికి భంగం కలగకుండా చూసుకునే బాధ్యత కూడా తనదంటూ చెప్పుకొచ్చారు.ఇదంతా ఓ ఎత్తు అయితే..ఓ వైపు ఫోన్ ట్యాపింగ్ కేసు..ఇంకోవైపు విద్యుత్ కొనుగోళ్లపై విచారణ.. మరోవైపు కాళేశ్వరం దర్యాప్తు..ఇలా రకరకాల ఇష్యూస్‌తో కేసీఆర్ మౌనాన్ని బద్దలు కొట్టే ప్రయత్నం చేశారు సీఎం. అయినా నో కామెంట్ అంటూ సైలెంట్‌గా ఉంటూ వచ్చారు కేసీఆర్. ఫాంహౌస్‌లో నేతలతో భేటీ అయినా..పబ్లిక్ మీటింగ్‌లకు అటెండ్ అయినా..ఎక్కడా రేవంత్ పేరు తీయకుండానే ఈ ప్రభుత్వ పనితీరు బాలేదని..ప్రజలు సంతోషంగా లేరని చెప్పుకొంటూ వస్తున్నారు కేసీఆర్. దీంతో ఇన్నాళ్లు రేవంత్ వేసిన ఎత్తులేవి వర్కౌట్ కాలేదు. ప్రభుత్వం, సీఎం రేవంత్ చేసిన ఏ ఆరోపణపై కేసీఆర్ బయటికి వచ్చి రియాక్ట్ కాలేదు. ఈ నేపథ్యంలోనే రేవంత్ ఫైనల్ పంచ్ ఇచ్చేందుకు ఫాంహౌస్ ల్యాండ్స్ చుట్టూ ఎంక్వైరీ అంటూ రచ్చకు తెరలేపారని అంటున్నారు.అధికార పార్టీ నుంచి ఎన్ని విమర్శలు వచ్చినా..రేవంత్‌రెడ్డి ఎన్నిసార్లు కేసీఆర్ను ఉద్దేశించి పర్సనల్ అటాక్ చేసినా..దమ్ముంటే అసెంబ్లీకి రావాలని సవాల్ చేసినా..గులాబీ బాస్ రియాక్ట్ అయిన దాఖలాలు లేవు. సీఎం రేవంత్ రెడ్డి పేరును కూడా ప్రస్తావించకుండా కేసీఆర్ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారన్న ఒపీనియన్స్ ఉన్నాయి. సీఎం రేవంత్, కాంగ్రెస్ నేతలు అలిగేషన్స్‌కు సమాధానం చెప్పే బాధ్యతను కేటీఆర్, హరీశ్‌రావులే తీసుకుంటున్నారు. రేవంత్ రెడ్డి స్థాయికి తామే సరిపోతామ్..కేసీఆర్ స్పందించాల్సిన అవసరం లేదని వాళ్లిద్దరే రివర్స్ అటాక్‌కు దిగుతున్నారు.కానీ రేవంత్ టార్గెట్ ఒక్కటే. కేసీఆర్ నోరు తెరిపించాలి. తన పేరు ప్రస్తావించి మాట్లాడే పరిస్థితి తీసుకురావాలి. అన్నింటికి మించి రేవంత్ వర్సెస్ కేసీఆర్ అన్నట్లుగానే తెలంగాణ పొలిటికల్ సినారియోలో డైలాగ్ వార్ కొనసాగాలనేది రేవంత్ మాస్టర్ ప్లాన్ అంటున్నారు. అందుకే సందర్భం దొరికిన ప్రతీసారి కేసీఆర్‌ను టార్గెట్ చేస్తూ వస్తున్నారని అంటున్నారు. సరిగ్గా ఎన్నికలకు ఏడాది ముందు కేసీఆర్ రంగంలోకి దిగాలని..అదే తమ ఎన్నికల అస్త్రమని బీఆర్ఎస్ భావిస్తోంది. అదే జరిగితే ఎన్నికల్లో కేసీఆర్‌కు సానుభూతి వచ్చే అవకాశం ఉంటుందని..

ఆలోపే కేసీఆర్ నోరు తెరిపించాలని రేవంత్ ప్లాన్ అని అంటున్నారు. దీంతో ఈ ఇద్దరి పోరాటం.. రసవత్తరంగా మారుతోంది.మరి ఈ సారి రేవంత్ వేసిన ల్యాండ్ ఎంక్వైరీపై కేసీఆర్ స్పందిస్తారా.? రేవంత్ ఫైనల్ పంచ్‌కు కేసీఆర్ మౌనం వీడుతారా.? ఇప్పటివరకు అనుసరిస్తున్న వ్యూహాన్నే కొనసాగిస్తారా.? ఇదే ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో ఇంట్రెస్టింగ్ టాపిక్‌గా మారింది. ఒకవేళ కేసీఆర్ స్పందిస్తే..కాంగ్రెస్-బీఆర్ఎస్ మధ్య రాజకీయ సమరం కొత్త మలుపు తిరిగే అవకాశం ఉంది. స్పందించకపోతే..బ్లేమ్ గేమ్ వెపన్‌గా మలుచుకునేందుకు హస్తం పార్టీ రెడీ అవుతోంది. రేవంత్ లేవనెత్తిన ఈ ల్యాండ్ లడాయి ఎటు టర్న్ తీసుకుంటుందో చూడాలి మరి.

అభ్యర్థి ఎంపికపై బీఆర్ఎస్ కసరత్తు.. టికెట్ దక్కేదెవరికి..?



హైదరాబాద్, : దానం నాగేందర్‌పై హైకోర్టు అనర్హత వేటు వేయడంతో ఖైరతాబాద్ అసెంబ్లీ సీటుకు ఉప ఎన్నిక జరగడం దాదాపు ఖాయమైంది. బీఆర్ఎస్‌లో అప్పుడే ఖైరతాబాద్ బైపోల్‌పై చర్చ మొదలైంది. నిన్నటి వరకు దానం నాగేందర్‌పై పోరాటం చేసిన బీఆర్ఎస్..ఇప్పుడు అదే సీటును తిరిగి స్వాధీనం చేసుకునేందుకు కసరత్తు స్టార్ట్ చేస్తోంది. అందుకే..అభ్యర్థి ఎంపికపై ఆచితూచి అడుగులు వేయాలని డిసైడ్ అయింది గులాబీ పార్టీ అధిష్టానం. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్‌లో ఖైరతాబాద్ టికెట్ ఆశిస్తున్న నేతలు.. ఎవరి ప్రయత్నాల్లో వాళ్లు బిజీ అయిపోయారట.పీజేఆర్ తనయుడు విష్ణువర్ధన్ రెడ్డి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. నియోజకవర్గాల పునర్విభజనకు ముందు ఖైరతాబాద్ నుంచి పోటీ చేసిన విష్ణుకు..నియోజకవర్గంతో ఉన్న పాత పరిచయాలు, పీజేఆర్ కుటుంబానికి ఉన్న రాజకీయ అనుబంధం తమకు కలిసొస్తుందని బీఆర్ఎస్ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఖైరతాబాద్‌కు బైపోల్ వస్తే విష్ణువర్ధన్ రెడ్డిని బరిలో దింపే ఆలోచనలో బీఆర్ఎస్ ఉన్నట్లు కూడా ఎప్పటినుంచో ప్రచారం ఉంది.గతంలో ఇక్కడి నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసిన ఎమ్మెల్సీ దానోజు శ్రవణ్ పేరు కూడా టికెట్ రేసులో వినిపిస్తోంది. గతంలో ఖైరతాబాద్ నుంచి పోటీ చేసిన శ్రవణ్..ప్రస్తుతం బీఆర్ఎస్ ఎమ్మెల్సీగా ఉన్నారు. నియోజకవర్గంతో ఉన్న అనుబంధంతో పాటు..బీసీ సామాజిక సమీకరణాలు కూడా తనకు అనుకూలంగా మారుతాయని ఆయన భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక మరో నేత తలసాని సాయికిరణ్ పేరు ఈ రేసులోకి రావడం మరింత ఆసక్తి రేపుతోంది. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తనయుడు సాయికిరణ్ యాదవ్ కూడా ఖైరతాబాద్ టికెట్ ఆశిస్తున్నట్లు టాక్.ఉపఎన్నిక రాబోతుందని ప్రచారం నడుస్తున్నప్పటి నుంచి సాయికిరణ్‌ను బరిలోకి దింపాలని తలసాని ప్రయత్నిస్తున్నారన్న ప్రచారం నడిచింది. సంక్రాంతి సందర్భంగా ఖైరతాబాద్ పరిధిలో జరిగిన కార్యక్రమాల విషయంలోనూ తలసాని, దానం వర్గాల మధ్య పోటాపోటీ కనిపించిందన్న చర్చ అప్పట్లో జరిగింది. దీంతో ఖైరతాబాద్ ఉపఎన్నికలో తనయుడు సాయికిరణ్‌ను పోటీ చేయించేందుకు తలసాని శ్రీనివాస్ యాదవ్ అప్పుడే ప్రయత్నాలు మొదలుపెట్టారన్న టాక్ వినిపిస్తోంది.తలసాని సాయికిరణ్ 2019 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి కంటెస్ట్ చేసి ఓడిపోయారు.మరోవైపు పార్టీ కోసం చాలాకాలంగా పనిచేస్తున్న మన్నె గోవర్ధన్ రెడ్డి పేరు కూడా మరోసారి తెరపైకి వచ్చింది. 2014లో ఖైరతాబాద్ నుంచి పోటీ చేసిన మన్నె..2018, 2023లో దానం నాగేందర్‌కు అవకాశం ఇవ్వడంతో సీటు త్యాగం చేసి సహకరించారని ఆయన వర్గం చెబుతోంది. విష్ణువర్ధన్‌రెడ్డి..దానోజు..సాయికిరణ్..మన్నె గోవర్ధన్‌రెడ్డి.. నలుగురి పేర్లు ఇప్పుడు ప్రచారంలో ఉన్నప్పటికీ..ఇక్కడే బీఆర్ఎస్ అసలు కసరత్తు మొదలుపెడుతుందట. ఎవరికి స్థానికంగా బలం ఉంది.? క్యాడర్‌ను నడిపించే సామర్థ్యం ఉన్న లీడర్లు ఎవరు.? సామాజిక సమీకరణాలు ఏంటి.? కాంగ్రెస్ అభ్యర్థిని ఢీకొట్టేందుకు ఎవరైతే సరైన అభ్యర్థి.? ఇలాంటి అంశాలన్నింటినీ పరిశీలించాకే అభ్యర్థిని ఫైనల్ చేయాలని గులాబీ అధిష్టానం భావిస్తోందన్న చర్చ జరుగుతోంది.గత బైపోల్స్ అనుభవాలను కూడా పరిగణనలోకి తీసుకుని..చివరి నిమిషం వరకు అభ్యర్థి ఎంపికపై సర్వేలు, ఫీడ్ బ్యాక్ తీసుకునే అవకాశం ఉందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. గత రెండు బైపోల్స్‌లోనూ అభ్యర్థి విషయంలో చేసిన పొరపాటు ఈ సారి చేయకూడదనే పట్టుదలతో ఉంది గులాబీదళం. ఎమ్మెల్యేల మృతితో వచ్చిన ఎన్నికలు కావడంతో కంటోన్మెంట్, జూబ్లీహిల్స్‌లో అనివార్యంగా వారి కుటుంబసభ్యులకే టికెట్ ఇవ్వాల్సి వచ్చిందని..ఈ సారి గెలుపు గుర్రాన్నే ఎంపిక చేసుకునే అవకాశం ఉందని బీఆర్ఎస్ భావిస్తోంది.కేటీఆర్ ఇప్పటికే దానం నాగేందర్ అనర్హతపై స్పందిస్తూ.. ఖైరతాబాద్ ఉపఎన్నికలో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ మారిన మిగతా ఎమ్మెల్యేలకూ ఇదే గతి పడుతుందన్నారు. దీంతో బీఆర్ఎస్‌కు ఖైరతాబాద్ బైపోల్ కేవలం మరో ఎన్నిక కాదనే చర్చ మొదలైంది. ఖైరతాబాద్‌లో గెలిచి అధికార పార్టీకి, జంపింగ్ ఎమ్మెల్యేలకు ఝలక్ ఇవ్వాలని కసి మీదుందట బీఆర్ఎస్. అందుకే క్యాండిడేట్ సెలక్షన్స్ విషయంలో ఒక్క చిన్న తప్పిదం కూడా చేయకూడదని గులాబీ పార్టీ భావిస్తున్నట్లు టాక్. ఖైరతాబాద్ బరిలో దిగే గులాబీ అభ్యర్థి ఎవరన్నది నోటిఫికేషన్ వస్తే తప్ప క్లారిటీ వచ్చేలా లేదు.

అన్నీ పార్టీలకు సవాలే...



హైదరాబాద్, : దానం నాగేందర్‌పై అనర్హత వేటుతో ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గానికి అనివార్యంగా మారే ఉపఎన్నిక ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్‌కు కొత్త ఊపిరి పోస్తుందా లేక మరిన్ని రాజకీయ సమస్యల్లోకి నెడుతుందా అన్నది ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. పైకి చూస్తే అధికార కాంగ్రెస్‌పై పోరాడేందుకు ఇది ఒక సువర్ణావకాశంలా కనిపించినప్పటికీ, గ్రౌండ్ రియాలిటీ మాత్రం గులాబీ పార్టీకి పెను సవాలును విసురుతోంది. గతంలో పక్కనే ఉన్న జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆకస్మిక మరణం తర్వాత వచ్చిన ఉపఎన్నికలోనూ సెంటిమెంట్, సానుభూతి ఏమాత్రం పనిచేయలేదు. హైదరాబాద్ మహానగర పరిధిలో గ్రామీణ ప్రాంతాల తరహా సాంప్రదాయ రాజకీయాలు, సానుభూతి పవనాలు పనిచేయవన్న విషయం ఆ చేదు ఫలితంతో బీఆర్ఎస్‌కు స్పష్టంగా అర్థమైంది.ఖైరతాబాద్ క్షేత్రస్థాయి సమీకరణాలను నిశితంగా పరిశీలిస్తే ఇక్కడ సంస్థాగతంగా బీఆర్ఎస్ బలం దాదాపు శూన్యమనే చెప్పాలి. గత దశాబ్ద కాలంగా అక్కడ రాజకీయం మొత్తం దానం నాగేందర్ చుట్టూనే తిరిగింది తప్ప, పార్టీకంటూ ప్రత్యేక క్యాడర్ నిర్మాణం బలంగా జరగలేదు. దానంకు నియోజకవర్గంలో ఉన్న బలమైన వ్యక్తిగత అనుచరగణం, స్థానిక బస్తీల్లో ఆయనకున్న వ్యక్తిగత పట్టు కాదనలేని వాస్తవం. దీనికి తోడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి ఖైరతాబాద్‌లో సంప్రదాయబద్ధంగా ఉన్న పాత ఓటుబ్యాంకు, సంస్థాగత క్యాడర్ తోడవుతాయి. ఇలాంటి పరిస్థితుల్లో బలమైన లోకల్ కేడర్, సరైన అభ్యర్థి లేని బీఆర్ఎస్‌కు దానం వ్యక్తిగత బలం, కాంగ్రెస్ ప్రభుత్వ యంత్రాంగాన్ని ఎదుర్కొని నిలబడటం కత్తిమీద సామే అవుతుంది.ఒకవేళ ఈ ఉపఎన్నిక జరిగి, అధికార కాంగ్రెస్ పార్టీ దానం నాగేందర్‌ను నిలబెట్టి మళ్లీ గెలిపించుకుంటే.. అది బీఆర్ఎస్ శ్రేణుల ఆత్మవిశ్వాసాన్ని కోలుకోలేని విధంగా దెబ్బతీస్తుంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో తనకున్న పట్టు చేజారిపోయిందని, పార్టీ మారిన నేతను కూడా ఓడించలేకపోయామనే బలహీనమైన సంకేతం రాష్ట్రవ్యాప్తంగా వెళ్తుంది. ఇది జీహెచ్ఎంసీ ఎన్నికలతో పాటు రాష్ట్ర రాజకీయాల్లో గులాబీ పార్టీ క్యాడర్‌ను తీవ్ర నైరాశ్యంలోకి నెట్టే ప్రమాదం ఉంది. ప్రత్యర్థి చేతిలో దెబ్బతిని నైతికంగా కుంగిపోవడం కంటే, ఇలాంటి ప్రతికూల సమయంలో ఉపఎన్నికలను ఎదుర్కోవడం పార్టీకి రాజకీయంగా పెద్ద రిస్క్ అనే చెప్పాలి.అందుకే ఈ ఖైరతాబాద్ ఉపఎన్నిక అటు బీఆర్ఎస్‌కు మాత్రమే కాదు, ఇటు అధికార కాంగ్రెస్‌కు కూడా ఒక అన్‌వాంటెడ్ తలనొప్పి లాంటిదే. అధికారంలో ఉండి ఒక్క ఉపఎన్నికలో కూడా తేడా రాకూడదనే ఒత్తిడి కాంగ్రెస్‌పై ఉంటే.. పరువు కాపాడుకోవాల్సిన డూ ఆర్ డై సిట్యువేషన్ బీఆర్ఎస్‌ను వెంటాడుతోంది. గెలిస్తే వచ్చే మైలేజీ కంటే, పొరపాటున ఓడిపోతే ఎదురయ్యే నష్టమే బీఆర్ఎస్‌కు పదిరెట్లు ఎక్కువగా కనిపిస్తోంది. కాంగ్రెస్ పరిస్థితి కూడా అంతే. అయినా ఉపఎన్నికను రెండు పార్టీలు ఎదుర్కోక తప్పదు.

వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్టుకు ఫుల్ క్రేజీ



వరంగల్, : తెలంగాణ కాంగ్రెస్‌లో ఏ పోస్టుకు లేనంత క్రేజ్ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవులకు ఉంటుంది. వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి.. ఒక లక్కీ పోస్ట్‌గా భావిస్తుంటారు నేతలు. ఎందుకంటే పీపీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లు పనిచేసిన లీడర్లు ఉన్నత స్థానాలకు ఎదుగుతారనే సెంటిమెంట్ ఉంది. ప్రస్తుతం మంచి పొజిషన్‌లో ఉన్న నేతలంతా కూడా తెలంగాణ ఏర్పడిన తర్వాత వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పనిచేసినవారే. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు అజారుద్దీన్, పొన్నం ప్రభాకర్ ఇలా అందరూ వర్కింగ్ ప్రెసిడెంట్లుగా పనిచేశారు.తెలంగాణ ఏర్పడిన తర్వాత మొదట వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పనిచేసిన ఉత్తమ్ కుమార్ రెడ్డి తర్వాత పీసీసీ చీఫ్‌గా రికార్డ్ స్థాయిలో ఏడేళ్లు పని చేశారు. తర్వాత వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పనిచేసిన భట్టి విక్రమార్క సీఎల్పీ లీడర్ అయ్యారు. ఇప్పుడు డిప్యూటీ సీఎంగా ఉన్నారు. ఇక రేవంత్ రెడ్డి వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి చేపట్టి తర్వాత.. పీసీసీ చీఫ్.. ఆ తర్వాత సీఎం అయ్యారు. మహేష్ కుమార్ గౌడ్ కూడా వర్కింగ్ ప్రెసిడెంట్ తర్వాత పీసీసీ చీఫ్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. త్వరలో ఆయనకు కూడా ప్రమోషన్ దక్కబోతుందని ప్రచారం నడుస్తోంది. ఇలా వర్కింగ్ ప్రెసిడెంట్లుగా పనిచేసిన వారికి తర్వాత లక్కీ ఛాన్స్ ఉంటుందనే బలమైన నమ్మకం ఉండటంతో..ఆశావహుల జాబితా పెరిగిపోతోంది.ప్రపంచ పటాలు పరిశీలించండిముఖ్య నేతలు కూడా తమ వారికి వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్ట్ ఇప్పించుకునేందుకు లాబీయింగ్ చేస్తున్నారట. అయితే, ఈ పోస్టుల నియామకం కోసం పెద్ద కసరత్తే జరుగుతోందట. కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్టులకు పోటీ పడుతున్న పలువురు పేర్లపై అభ్యంతరాలు వ్యక్తం చేశారట. దీంతో దాదాపు రెండేళ్లుగా ఈ పదవుల నియామకం పెండింగ్‌లో పడుతూ వచ్చింది. అనేక రకాల చర్చల తర్వాత.. వర్కింగ్ ప్రెసిడెంట్ల నియామకానికి పార్టీ హైకమాండ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందనే టాక్ బలంగా వినిపిస్తుంది.ప్రస్తుతం ఇంచార్జ్‌గా ఉన్న మీనాక్షి నటరాజన్ లండన్ వెళ్తున్నారు. ఇప్పటికే వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్టులపై ఆమె హైకమాండ్‌కు రిపోర్ట్ ఇచ్చేశారట. అన్ని సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించాలని అధిష్టానం భావిస్తోందట. రెడ్డి సామాజిక వర్గం నుంచి సీఎం రేవంత్ తన స్నేహితుడు రోహిణ్ రెడ్డి కోసం పట్టు బట్టడంతో.. ఇంచార్జ్ మీనాక్షి కూడా ఓకే చెప్పారట. మైనారిటీ వర్గం నుంచి సీఎం రేవంత్.. తన సన్నిహితుడు ఫహీం ఖురేషి పేరు ప్రతిపాదిస్తే ఇంచార్జ్ మీనాక్షి బ్రేక్ వేశారట. ఈ విషయంలో సీఎం కూడా వెనక్కి తగ్గారట. మైనారిటీ వర్గం నుంచి ఓబేదుల్లా కొత్వాల్ పేరు ఖరారైందట. ఎస్టీ వర్గం నుంచి ఎంపీ బలరాం నాయక్.. ఎస్సీ వర్గం నుంచి నంవత్ కుమార్ పేర్లను ఫిక్స్ చేశారని అంటున్నారు.వర్కింగ్ ప్రెసిడెంట్లతో పాటు పెండింగ్‌లో ఉన్న ప్రచార కమిటీ, మిగిలిన జనరల్ సెక్రటరీలు, వైస్ ప్రెసిడెంట్ పోస్టులను కూడా భర్తీ చేయబోతున్నారట. నామినేటెడ్ పోస్టులకు కూడా హైకమాండ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని చర్చించుకుంటున్నారు. ఈ నియామకాలన్నింటినీ వారం రోజుల్లోగా పూర్తి చేయాలని భావిస్తున్నారట పార్టీ పెద్దలు. ఈ సారైనా వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్టులకు గ్రహణం వీడుతుందో.? మళ్లీ ఏదైనా బ్రేకులు పడుతాయో.? చూడాలి మరి.

దానం భయం వెనుక కథేంటీ..?

హైదరాబాద్, : పార్టీ ఫిరాయింపు ఆరోపణలతో తనను ఎమ్మెల్యే పదవికి అనర్హుడిగా ప్రకటిస్తూ తెలంగాణ హైకోర్టు వెలువరించిన తీర్పును మాజీ ఎమ్మెల్యే దానం నాగేందర్ సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. తీర్పు వచ్చిన వెంటనే సుప్రీంకోర్టుకు వెళ్లే ఆలోచన లేదని.. తాను ఫైటర్ నని, ప్రజాక్షేత్రంలోనే తేల్చుకుంటానని అన్నారు. అంతలోనే ఏం జరిగిందో కానీ, మరుసటి రోజే తనకు న్యాయం చేయాలంటూ సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. డైరీ నంబరు 58219/2026తో పిటిషన్ దాఖలు చేసిన ఆయన, ఇందులో బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డిని ప్రతివాదిగా చేర్చారు. రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ పేరా 2(1)(ఎ), ఆర్టికల్ 191(2) కింద తనను అనర్హుడిగా ప్రకటించడం చట్టవిరుద్ధమని దానం నాగేందర్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు.ఎమ్మెల్యేల అనర్హత అంశంలో అసెంబ్లీ స్పీకర్ తీసుకునే నిర్ణయాలను కోర్టులు సమీక్షించడానికి వీలులేదని దానం నాగేందర్ ప్రధాన వాదన. ఒకవేళ సభ లోపల సభ్యుడి (ఎమ్మెల్యే) వ్యవహార శైలి ఆధారంగానే స్పీకర్ నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందన్నారు. అసెంబ్లీ వెలుపల సభ్యుడి ప్రవర్తన లేదా ఇతర పార్టీ తరఫున పోటీ చేశారనే ఫిర్యాదులు స్పీకర్ పరిధిలోకి రావన్నారు. ఈ విషయంలో స్పీకర్ తీసుకున్న నిర్ణయమే తుది నిర్ణయమని దానం నాగేందర్ స్పష్టం చేశారు. ఆర్టికల్ 226 కింద హైకోర్టు ఈ వ్యవహారంలో జోక్యం చేసుకోవడం సరికాదని తన పిటిషన్‌లో ప్రస్తావించారు.తాను బీఆర్ఎస్ సభ్యత్వానికి రాజీనామా చేయలేదని, అలాగే కాంగ్రెస్ పార్టీ సభ్యత్వం కూడా తీసుకోలేదని మాజీ ఎమ్మెల్యే దానం నాగేందర్ స్పష్టం చేశారు. కేవలం మెడలో మూడరంగుల కండువా వేసుకున్నంత మాత్రాన కాంగ్రెస్‌లో చేరినట్లు భావించకూడదన్నారు. కాగా, ఈ పిటిషన్‌పై తమ వాదనలు విన్నాకే తగిన నిర్ణయం తీసుకోవాలని కోరుతూ బీజేపీ నేత మహేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిలు సుప్రీంకోర్టులో కేవియట్ పిటిషన్లు దాఖలు చేశారు. తన పిటిషన్‌ను సాధ్యమైనంత త్వరగా మెన్షన్ చేసి అత్యవసర విచారణ కోరాలని దానం నాగేందర్ తరఫు న్యాయవాదులు కోరారు.హైకోర్టు తీర్పుపై తొలుత ఉపఎన్నికకే తాను సిద్ధమని, ప్రజాక్షేత్రంలోనే తేల్చుకుంటానన్న దానం నాగేందర్, అంతలోనే సుప్రీంకోర్టును ఆశ్రయించడం హాట్ టాపిక్ అవుతోంది. ఇటీవల ఇళ్ల లబ్ధిదారుల లక్కీ డ్రా ఎమ్మెల్యే లేకుండానే చేయడం, తమకు సరిగ్గా విలువ ఇవ్వడం లేదని.. అదే సమయంలో ఎంఐఎం ఎమ్మెల్యేలు అయితే అధికారులు ఉ×చ్చ పోసుకుంటున్నారని అసెంబ్లీలో వ్యాఖ్యానించడం తెలిసిందే. ఇటు బీఆర్ఎస్ ఎలాగూ సీటు ఇవ్వదు. అటు కాంగ్రెస్ లోనూ జూబ్లీహిల్స్‌లో అజారుద్దీన్‌కు ఎదురైన పరిస్థితే ఖైరతాబాద్‌లో తనకు ఎదురవుతుందని దానం భావించారని వినిపిస్తోంది. బై ఎలక్షన్ వచ్చినా కాంగ్రెస్ తనకే బీ ఫారమ్ ఇస్తుందని నమ్మకం లేకపోవడంతో సుప్రీంకోర్టుకు వెళ్లారన్న చర్చ ఊపందుకుంది.పలుమార్లు పార్టీలు మారిన దానం, గతంలో ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ బీఆర్ఎస్‌ను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నించారు. అయితే, ఉపఎన్నికల్లో తనకు మద్దతు లభిస్తుందో లేదోనన్న ఆందోళనతో సుప్రీంకోర్టు మెట్లు ఎక్కారని ప్రచారం జరుగుతోంది.

ఎరక్కపోయి... ఇరుక్కుపోయిన గులాబీ

హైదరాబాద్, : రాజకీయాల్లో ప్రత్యర్థిని ఇరుకున పెట్టేందుకు వేసే ప్రతి వ్యూహం ఆచితూచి ఉండాలి. ఏమాత్రం గురి తప్పినా లేదా మన రికార్డుల్లోనే లోపాలున్నా.. అది కాస్తా రివర్స్ అయి స్వయంకృతాపరాధంగా మారుతుంది. ప్రస్తుతం తెలంగాణలో భారత్ రాష్ట్ర సమితి పరిస్థితి అచ్చం చెట్టు కొట్టి నెత్తిన వేసుకున్నట్లే తయారైంది. రిజిస్ట్రేషన్ల శాఖలో నిషేధిత జాబితా అంశాన్ని పట్టుకుని, రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది ప్రజల ఆస్తులు ప్రమాదంలో పడ్డాయంటూ ప్రజల్లో భయాందోళనలు సృష్టించాలని బీఆర్ఎస్ అగ్రనాయకత్వం భావించింది. దాదాపు కోటి ఎకరాలకు పైగా భూములు 22ఏ జాబితాలోకి వెళ్లాయని తీవ్రస్థాయి ప్రచారం చేసి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆత్మరక్షణలోకి నెట్టాలని చూసింది.ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలని వేసిన ఎత్తుగడ చివరకు తమ మెడకే చుట్టుకున్నట్లయింది గులాబీ పార్టీ పరిస్థితి. సాంకేతిక కారణాలతో రిజిస్ట్రేషన్ల శాఖలో సెక్షన్ 22ఏ కింద నమోదైన కొన్ని భూముల సమస్యను పట్టుకుని, కాంగ్రెస్ ప్రభుత్వంపై పెద్ద ఎత్తున ప్రజావ్యతిరేకతను మూటగట్టాలని బీఆర్ఎస్ తీవ్ర ప్రయత్నం చేసింది. ప్రభుత్వం ప్రజల ఆస్తులను లాక్కుంటోందంటూ క్షేత్రస్థాయిలో భయాందోళనలు సృష్టించేందుకు పార్టీ శ్రేణులు వ్యూహాత్మకంగా ముందుకొచ్చాయి. అయితే, ప్రభుత్వం ఎదురుదాడి చేయకుండా అత్యంత వేగంగా స్పందించడంతో బీఆర్ఎస్ వేసిన తాలి అడుగులోనే పట్టు తప్పింది.సాంకేతిక లోపం వల్ల కొద్దిమంది రైతులు, భూయజమానులకు మాత్రమే ఈ ఇబ్బంది ఎదురైందని గుర్తించిన రేవంత్ రెడ్డి సర్కార్, ఏమాత్రం మొండిపట్టుకు పోకుండా బహిరంగంగా వివరణ ఇచ్చింది. సంబంధిత శాఖ మంత్రి ప్రజలకు అసౌకర్యం కలిగినందుకు చింతిస్తూ, రికార్డులను వెంటనే సరిచేయాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. రోజుల వ్యవధిలోనే సమస్య పరిష్కారం కావడంతో రైతులు, సామాన్యుల్లో ఆందోళన సద్దుమణిగింది. దీంతో ప్రభుత్వాన్ని కార్నర్ చ

రెండేళ్ల పాలనకు రెఫరెండమేనా!



విజయవాడ : ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహాలు శరవేగంగా సాగుతుండటంతో, ఈ ఎన్నికల ఫలితాలు కూటమి ప్రభుత్వం సాధించిన రెండేళ్ల పాలనకు రెఫరెండం అవుతాయా అనే చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది. సర్వే ఏజెన్సీలు ఇచ్చే ప్రైవేటు సర్వేలు, ఒపీనియన్ పోల్స్ ఎన్ని వచ్చినా.. గ్రామ , నగర స్థాయిలో ఓటర్లు నేరుగా తమ ఓటు హక్కును వినియోగించుకునే ఈ ఎన్నికలే అసలైన ప్రజాభిప్రాయానికి నిలువెత్తు అద్దమని నమ్మడంలో సందేహం లేదు. అయితే, ఈ ఎన్నికలను బహిరంగంగా రెఫరెండం గా అంగీకరించేందుకు రాజకీయ పార్టీలు, ముఖ్యంగా అధికార పక్షం ముందుకు వస్తుందా లేదా అనేది అసలైన ప్రశ్న.సాధారణంగా ఏ రాష్ట్రంలోనైనా అధికారంలో ఉన్న పార్టీలు స్థానిక సంస్థల ఎన్నికలను తమ ప్రభుత్వ పాలనపై రెఫరెండం అని అధికారికంగా ప్రకటించడానికి ఇష్టపడవు. స్థానిక ఎన్నికల్లో కేవలం రాష్ట్రస్థాయి విధానాలు లేదా సంక్షేమ పథకాలే కాకుండా, స్థానిక అభ్యర్థి ఇమేజ్, కుల సమీకరణాలు, వ్యక్తిగత సంబంధాలు, ధనప్రవాహం వంటి అనేక హైపర్-లోకల్ అంశాలు ప్రభావం చూపుతాయి. ప్రభుత్వంపై ఎంత పాజిటివ్ వేవ్ ఉన్నప్పటికీ, స్థానికంగా ఎంపీటీసీ, సర్పంచ్ , కార్పొరేటర్ అభ్యర్థులపై ఉండే అసంతృప్తి వల్ల కూడా కొన్ని స్థానాలు చేజారే ప్రమాదం ఉంటుంది. అందుకే, అధికార కూటమి ఈ ఎన్నికల్లో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేసినప్పటికీ, దీనికి రెఫరెండం ముద్ర వేసి అనవసర రాజకీయ ప్రమాదాన్ని కొనితెచ్చుకోదు.మరోవైపు, ప్రైవేటు సర్వేల ను పక్కన పెడితే.. స్థానిక పోరులో వచ్చే ఫలితాలే అసలైన గ్రౌండ్ రియాలిటీని సూచిస్తాయి. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన సంచలనాత్మక తీర్పు తర్వాత, కూటమి అమలు చేస్తున్న సూపర్ సిక్స్ హామీలు, పింఛన్ల పెంపు, ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాలు , అమరావతి అభివృద్ధి వంటి పరిణామాలు ప్రజల్లో ఎంతవరకు సానుకూలతను నింపాయో ఈ ఎన్నికల ద్వారా స్పష్టమవుతుంది. గ్రామీణ ,పట్టణ ఓటర్లు కూటమి పాలన పట్ల సంతృప్తిగా ఉన్నారా లేదా అనేది బ్యాలెట్ బాక్సుల ద్వారా నిరూపితమవుతుంది. ఇక ప్రతిపక్ష వైఎస్ఆర్‌సీపీ ఈ రెఫరెండం వాదనను ఒక రాజకీయ ఆయుధంగా మార్చుకోవడానికి ప్రయత్నిస్తోంది. కూటమి ప్రభుత్వ వైఫల్యాలకు, హామీల నెరవేర్పులో జరుగుతున్న జాప్యానికి ఈ ఎన్నికలే కొలమానం అని ప్రచారం చేయడం ద్వారా ఓటర్లను తమవైపు తిప్పుకోవచ్చని భావిస్తోంది. అయితే, జగన్ పార్టీ నిజంగా ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని, అధికార పార్టీకి కౌంటర్ ఇవ్వాలంటే కేవలం విమర్శలకే పరిమితం కాకుండా, ప్రతీ స్థానంలోనూ గట్టి పోటీని ఇచ్చి ఓటర్లలో నమ్మకాన్ని పునరుద్ధరించాల్సి ఉంటుంది. ఇక అధికారంలో ఉన్న టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి పరంగా చూస్తే, ఈ ఎన్నికలు కేవలం గెలుపోటములకే పరిమితం కాకుండా, మిత్రపక్షాల మధ్య సమన్వయం ఎంతవరకు బలపడిందో తేల్చే వేదికగా మారనున్నాయి. క్షేత్రస్థాయిలో వార్డులు, పంచాయతీల స్థాయిలో టిక్కెట్ల కేటాయింపులో పార్టీల మధ్య ఘర్షణలు రాకుండా చూసుకోవడం కూటమి పెద్దలకు సవాలుగా మారనుంది.కూటమి నేతలు స్వేచ్ఛగా, పారదర్శకంగా ఎన్నికలు జరిపి భారీ విజయాన్ని సాధిస్తే, అది వైఎస్ఆర్‌సీపీ నైతిక ధైర్యాన్ని దెబ్బతీయడమే కాకుండా, కూటమి పాలనకు ప్రజల ఆమోదముద్ర పడినట్లే అవుతుంది. సాంకేతికంగా లేదా అధికారికంగా ఏ పార్టీ కూడా ఈ స్థానిక పోరును పాలనా రెఫరెండం అని ఒప్పుకోకపోయినా, రాజకీయ విశ్లేషకుల దృష్టిలో మరియు ప్రజల ఆలోచనల్లో ఇది కచ్చితంగా కూటమి ప్రభుత్వ పనితీరుకు వేసే గ్రేడింగ్ మార్కులే. ఈ ఎన్నికల ఫలితాలు రాబోయే 2029 సార్వత్రిక ఎన్నికలకు స్పష్టమైన పొలిటికల్ రోడ్‌మ్యాప్‌ను, మూడ్‌ను నిర్దేశిస్తాయనడంలో ఎలాంటి సందేహం లేదు

కీలక నేతలు గుడ్ బై..?



విశాఖపట్టణం: ఉత్తరాంధ్ర జిల్లాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి కీలక నేతలంతా వరుసగా గుడ్‌బై చెబుతుండటం, మౌనం వహించడంతో అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రంగంలోకి దిగారు. బెంగళూరు నుంచి తాడేపల్లికి తిరిగొచ్చిన జగన్ సీనియర్ నాయకులు బొత్స సత్యనారాయణ, తమ్మినేని సీతారాంలను ప్రత్యేకంగా పిలిపించి మాట్లాడారు. పార్టీ వీడుతున్న వారి సంఖ్య పెరుగుతుండటంతో శ్రేణులకు ధైర్యం చెప్పేందుకు ఈ అత్యవసర భేటీలను నిర్వహించినట్లు తెలుస్తోంది.ఈ భేటీలో ప్రధానంగా మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం కుమారుడు ..పార్టీకి ఒక్క సీటు కూడా రాదని చేసిన ప్రకటనపై చర్చ జరిగింది. సాధారణంగా పార్టీ గీత దాటి మాట్లాడే నేతలను దూరంగా పెట్టే జగన్, ఈసారి మాత్రం విభిన్నమైన వ్యూహాన్ని అమలు చేశారు. వ్యాఖ్యలు ఎలా ఉన్నా, ప్రస్తుతం పార్టీ సీనియర్లను కాపాడుకోవడమే ప్రాధాన్యంగా భావించిన జగన్..పార్టీలో అంతర్గత పోరును పరిష్కరిస్తానని చెప్పకుండా.. ఎవరైనా ఏమనుకున్నా సరే, రాబోయే ఎన్నికల్లో శ్రీకాకుళం లోక్‌సభ ఎంపీ అభ్యర్థిగా నీకే హామీ ఇస్తున్నా అని తమ్మినేనితో నేరుగా చెప్పినట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.మరోవైపు మాజీ మంత్రి బొత్స సత్యనారాయణతోనూ జగన్ విడిగా భేటీ అయ్యారు. విజయనగరం జిల్లా రాజకీయాల్లో బొత్స తీరుపై రకరకాల చర్చలు జరుగుతున్న సమయంలో ఎన్నికల దిశగా పూర్తి స్పష్టత ఇచ్చారు. రాబోయే అసెంబ్లీ పోరులో ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న చీపురుపల్లి నియోజకవర్గం నుంచే మళ్లీ పోటీకి సిద్ధమవ్వాలని అధినేత తేల్చిచెప్పినట్లు సమాచారం. నియోజకవర్గంలో పట్టు కోల్పోకుండా క్యాడర్‌ను సమాయత్తం చేసుకోవాలని సూచించారు.అయితే, అధినేత ఆఫర్ చేసిన టికెట్ల హామీలపై ఈ ఇద్దరు సీనియర్ నేతల నుంచి ఆశించిన స్థాయిలో స్పందన కనిపించలేదు. ప్రస్తుతం రీజియన్‌లో ఒకట్రెండు సీట్లు కూడా గెలిచే వాతావరణం కనిపించనప్పుడు, ఇప్పటి నుంచే ఈ సీట్ల ఖరారు వల్ల ప్రయోజనం ఏంటనే నిరాశ వారిలో కనిపిస్తోందని భావిస్తున్నారు. అందుకే ఈ సమావేశం ముగిసిన తర్వాత కూడా బొత్స గానీ, తమ్మినేని గానీ మీడియాతో ఏమీ మాట్లాడలేదు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో ప్రస్తుతం విచిత్రమైన రాజకీయ వాతావరణం నెలకొంది. అధికారంలో ఉన్నప్పుడు వ్యవస్థలను నడిపించిన తీరు, నేడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అనుసరిస్తున్న వ్యూహాలు పార్టీని మరింత నిరాశలోకి నెడుతున్నాయి. శ్రీకాకుళం జిల్లాలో బలమైన నేత, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం కుటుంబంపై చాపరం భూకబ్జా కేసు నమోదు అయింది. . హైకోర్టు వారికి తాత్కాలిక ఊరట నిచ్చింది. అయితే, కూటమి ప్రభుత్వ హయాంలో పోలీసులు కేసులు నమోదు చేసినప్పటికీ అరెస్టు కాకపోవడమే నేరమైనట్లు వైసీపీ అధిష్టానం భావించడం విడ్డూరంగా మారింది. అరెస్టు కాకుండా తప్పించుకున్నారంటే వారు కూటమి ప్రభుత్వంతో లోపాయికారీ ఒప్పందం కుదుర్చుకున్నట్లేనని, కోవర్టులుగా మారిపోయారనే ముద్ర వేస్తున్నారు.ఈ అనుమానాల రాజకీయం కేవలం తమ్మినేని కుటుంబానికే పరిమితం కాలేదు. గతంలో వైఎస్సార్‌సీపీకి మూలస్తంభంగా ఉండి, ఇటీవలే రాజీనామా చేసి బయటకు వచ్చిన మాజీ ఎంపీ వి.విజయసాయిరెడ్డి కూడా సరిగ్గా ఇదే తరహా తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తారు. కూటమి ప్రభుత్వం వచ్చాక దాదాపు అందరు కీలక నేతలపై ఏదో ఒక కేసు నమోదు కావడం లేదా అరెస్టులు జరగడం జరుగుతుంటే.. పార్టీ రాష్ట్ర కో-ఆర్డినేటర్‌గా ఉన్న సజ్జల రామకృష్ణారెడ్డిపై మాత్రం ఎలాంటి కేసులు, అరెస్టులు ఎందుకు నమోదు కావడం లేదని విజయసాయిరెడ్డి నిలదీశారు. అధికారంలో ఉన్నప్పుడు చట్టానికి అతీతంగా వ్యవహరించారని ఆరోపణలు ఎదుర్కొన్న సజ్జల, ఇప్పుడు కూడా ఎలాంటి చిక్కులు లేకుండా బయటపడటం కోవర్టు రాజకీయమే కాదా అన్న ప్రశ్నను ఆయన అధిష్టానం ముందే ఉంచారు.వైసీపీ అధిష్టానానికి మొదటి నుంచీ ఒక అలవాటు ఉందనే విమర్శలు బలంగా ఉన్నాయి. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు ప్రాణపణంగా నిలిచే సీనియర్ నేతలను సైతం.. చిన్నపాటి అనుమానం రాగానే వెన్నుపోటుదారులు గా ముద్రవేసి పక్కన పెట్టేస్తారు. గతంలో బాలినేని శ్రీనివాసరెడ్డి, సామినేని ఉదయభాను వంటి పలువురు సీనియర్లు పార్టీకి దూరం కావడం వెనుక ఈ అధిష్టానం అనుమానాస్పద వైఖరి ప్రధాన పాత్ర పోషించింది. ఇప్పుడు శ్రీకాకుళంలో తమ్మినేని వర్గాన్ని కూడా పార్టీ సమావేశాలకు పిలవకుండా, నియోజకవర్గ ఇన్‌చార్జ్ పదవి నుంచి తప్పించి రాజకీయంగా ఏకాకిని చేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ ధోరణి వల్ల సీనియర్లు తమ ఆత్మాభిమానం కోసం ప్రత్యామ్నాయ దారులు చూసుకోవడం అనివార్యమవుతోంది.ప్రస్తుతం అధికారంలో ఉన్న టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి సైతం వైసీపీలో ఉన్న ఈ బలహీనతను పక్కాగా వాడుకుంటోందనే విశ్లేషణలు వస్తున్నాయి. సీనియర్ నాయకులపై కేసులు నమోదు చేయడం , కొంతమంది విషయంలో చట్టపరమైన ప్రక్రియను సాగదీయడం ద్వారా వైసీపీ అధిష్టానంలో గందరగోళాన్ని సృష్టించడంలో కూటమి వ్యూహాత్మకంగా సఫలమవుతోంది. చట్టం తన పని తాను చేసుకుపోతున్నప్పటికీ, ఫలానా నేతను అరెస్టు చేయలేదంటే ఆయన తమతో కుమ్మక్కయ్యాడు అనే సందేశం వైసీపీ క్యాంపులోకి వెళ్లేలా మైండ్ గేమ్ ఆడటంలో అధికార పక్షం పైచేయి సాధిస్తోంది. ఆ ఉచ్చులో పడిన వైసీపీ నేతలు సొంత పార్టీ క్యాడర్‌లోనే అనుమానాల దావానాలాన్ని రగిల్చి నేతలను రోడ్డున పడేస్తున్నారు. అనుమానపు పక్షి కరిచిన చందంగా తయారైన వైసీపీ పరిస్థితి వల్ల దశాబ్దాలుగా పార్టీకి అండగా నిలిచిన క్షేత్రస్థాయి నాయకత్వం పూర్తిగా దెబ్బతింటోంది. ప్రతి చిన్న అంశాన్ని కోవర్టు కోణంలోనే చూస్తే, రాబోయే రోజుల్లో వైఎస్సార్‌సీపీలో మిగిలేది కొద్దిమంది చుట్టూ ఉన్న కోటరీ మాత్రమే తప్ప, ప్రజాక్షేత్రంలో నిలబడే నాయకులు ఉండరనేది పచ్చి నిజం

తిరుమలలో వరుణయాగం తర్వాత కుంభవృష్టి



తిరమల, : కలియుగ వైకుంఠముగా తిరుమల తిరుపతికి పేరు ఉంది. నిత్య కళ్యాణం, పచ్చ తోరణంగా ఈ క్షేత్రం భాసిల్లుతూ ఉంటుంది. ఈ ప్రాంతంలో ప్రతిరోజు పండుగలాగే ఉంటుంది. దేశవ్యాప్తంగా యాత్రికులు ఈ ప్రాంతానికి వస్తూ ఉంటారు. అందువల్లే తిరుమల నిత్యం యాత్రికులతో కిటకిటలాడుతూ ఉంటుంది. ఇక అన్నదాన సత్రంలో అయితే రోజూ వేలాదిమంది భక్తులు అన్నప్రసాదాలు స్వీకరిస్తూ ఉంటారు.తిరుమల కొండమీద ఉంటుంది. ఇక్కడ ప్రకృతి కూడా రమణీయంగా ఉంటుంది. ఈ ప్రాంతంలో పర్యావరణ పరిరక్షణ కోసం తిరుమల తిరుపతి దేవస్థానం విశేషంగా కృషి చేస్తూ ఉంటుంది. కాలుష్యానికి ఏమాత్రం ఆస్కారం లేకుండా.. కొండమీద జీవవైవిధ్యం దెబ్బ తినకుండా ప్రయత్నాలు చేస్తూ ఉంటుంది. అందువల్లే తిరుమల తిరుపతి ప్రపంచంలోనే అత్యంత ఆహ్లాదకరమైన దివ్య క్షేత్రంగా పేరుపొందింది.ప్రపంచ వ్యాప్తంగా ఎంత మంది యాత్రికులు వచ్చినా సరే వారందరికీ.. నీటి సౌకర్యం.. ఇతర వసతి సౌకర్యాలు తిరుమల తిరుపతి దేవస్థానం కల్పిస్తూ ఉంటుంది. ఈ స్థాయిలో నీటి సౌకర్యం కల్పించాలంటే కచ్చితంగా మెరుగైన వనరులు ఉండాలి. ఆ స్థాయిలో తిరుమల తిరుపతికి వనరులు ఉన్నాయి. వాటిని ఎప్పటికప్పుడు నీటితో నిండి ఉండేలాగా దేవస్థానం కృషి చేస్తూ ఉంటుంది. అయితే ఈ సంవత్సరం ఎల్ నీనో ప్రభావం వల్ల అంతగా వర్షాలు కురవలేదు. తిరుమల తిరుపతి ప్రాంతంలో ప్రతి ఏడాది విస్తారంగా వర్షాలు కురుస్తూ ఉంటాయి. కానీ ఈ ఏడాది పరిస్థితి అలా లేదు. పైగా బ్రహ్మోత్సవాల సమయంలో నీటి వినియోగం అధికంగా ఉంటుంది. ఈ సమయంలో ఉన్న వనరులలో అంతగా నీరు లేకపోవడంతో దేవస్థానం అందోళన చెందింది. ఈ క్రమంలో ఇటీవల తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో వరుణ యాగం నిర్వహించారు.వరుణ యాగం పూర్తి కావడంతో తిరుమల తిరుపతి దేవస్థానంలో అతి భారీ వర్షం కురిసింది. గంటపాటు విస్తారంగా వర్షం కురవడంతో రోడ్ల మీద వరద నీరు విస్తారంగా ప్రవహించింది. భక్తులు ఆలయ సమీపంలోని వాహన మండపం.. రామ్ బగీచా ఎదురుగా ఉన్న షెడ్లలో తలదాచుకున్నారు. కొద్దిరోజులుగా ఈ ప్రాంతంలో ఎండ వేడి విపరీతంగా ఉంది. ఈ సమయంలో వర్షం కురవడం భక్తులకు ఉపశమనం కలిగించింది. తిరుపతిలో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ చెబుతోంది. ఇటీవల వరుణ యాగం పూర్తయిన తర్వాత వర్షం కురవడంతో దేవస్థానం అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తిరుమలలో వర్షపు నీటిని వృధా కాకుండా డ్యామ్లలోకి తరలించే ఏర్పాట్లు ఉంటాయి. అందువల్లే వర్షపు నీరు డ్యామ్ లలోకి చేరడంతో భక్తులకు నీటి అవసరాలు తీరుతాయని దేవస్థాన అధికారులు చెబుతున్నారు.

అనిల్ కు దొరమౌతున్న నెల్లూరు!

నెల్లూరు, : నెల్లూరు జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజకీయాల్లో మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ అడుగులు మళ్లీ చర్చనీయాంశంగా మారాయి. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను వేదికగా చేసుకుని, నెల్లూరు సిటీ నియోజకవర్గ ఇన్ ఛార్జ్ పదవిని దక్కించుకోవడమే లక్ష్యంగా అనిల్ ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందుకోసం పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దృష్టిని ఆకర్షించేందుకు, అధికార కూటమి నేతలతో పాటు నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి దంపతులను టార్గెట్ చేస్తూ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నారు. అయితే, అనిల్ పడుతున్న ఈ ఆరాటం క్షేత్రస్థాయిలో ఆయనకు రాజకీయ లబ్ధిని చేకూరుస్తుందా అంటే.. సాధ్యం కాదనే సమాధానమే సొంత పార్టీ వర్గాల నుంచే వస్తోంది.జగన్ మోహన్ రెడ్డి నైజం తెలిసిన ఎవరికైనా అనిల్ ఆశలు నెరవేరడం అంత సులువు కాదని అర్థమైపోతుంది. ప్రస్తుతం నెల్లూరు సిటీ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్‌గా ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి వ్యవహరిస్తున్నారు. జగన్‌కు అత్యంత విశ్వసనీయుడిగా, ఆర్థికంగా , సామాజికంగా బలంగా ఉన్న చంద్రశేఖర్ రెడ్డిని పక్కనపెట్టి, గత ఎన్నికల్లో నరసరావుపేటకు వెళ్లి ఓటమిపాలై మళ్లీ నెల్లూరుకు వచ్చిన అనిల్ చేతికి సిటీ బాధ్యతలు అప్పగించే సాహసం జగన్ చేయకపోవచ్చని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. వైసీపీ అధిష్టానం ఆలోచన శైలి ప్రకారం.. ఒకసారి నియోజకవర్గం మారిన తర్వాత లేదా ఓటమిపాలయ్యాక మళ్లీ పాత స్థానానికి పూర్తి స్థాయిలో రీ-ఎంట్రీ ఇవ్వడం దాదాపు అసాధ్యం.మరోవైపు నెల్లూరు జిల్లా వైఎస్సార్‌సీపీలోని ప్రధాన రెడ్డి సామాజికవర్గ నేతలెవరూ అనిల్ కుమార్ యాదవ్‌ను మళ్లీ జిల్లా రాజకీయాల్లో చక్రం తిప్పనిచ్చేందుకు సిద్ధంగా లేరు. గతంలో మంత్రిగా ఉన్న సమయంలో ఆయన ప్రదర్శించిన ఏకపక్ష వైఖరి, సొంత పార్టీ నేతలతోనే విభేదించిన తీరు ఇంకా వారి మనసుల్లో మెదులుతూనే ఉంది. బిసి కార్డును వాడుకుని మళ్లీ తమ సామాజికవర్గానికి దక్కాల్సిన రాజకీయ అవకాశాలు, పట్టును అనిల్ కొట్టేస్తారనే భయం వారిలో బలంగా ఉంది. అందుకే జిల్లాలోని రెడ్డి సామాజికవర్గ సీనియర్లు అంతా అంతర్గతంగా అనిల్‌కు వ్యతిరేకంగా ఏకమవుతూ, ఆయనకు సిటీ బాధ్యతలు రాకుండా అధిష్టానం వద్ద గట్టిగానే అడ్డుకట్ట వేస్తున్నట్లు సమాచారం.స్థానిక ఎన్నికల హడావుడిని అడ్డం పెట్టుకుని, వేమిరెడ్డి దంపతులపై అనవసరమైన ఆరోపణలు, హడావుడి వ్యాఖ్యలు చేయడం ద్వారా తానే జిల్లాలో వైసీపీ తరఫున ఏకైక పోరాట యోధుడినని ప్రొజెక్ట్ చేసుకోవడానికి అనిల్ ప్రయత్నిస్తున్నారు. అయితే, గతంలో వైసీపీలోనే ఉండి పార్టీకి కొండంత అండగా నిలిచిన వేమిరెడ్డిని వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకోవడం వల్ల అనిల్‌కు పార్టీ శ్రేణుల నుంచి కూడా పెద్దగా మద్దతు లభించడం లేదు. పైగా ఈ రకమైన అతి దూకుడు వల్ల స్థానికంగా ప్రశాంతంగా ఉన్న కేడర్‌లో కూడా అనవసర ఉద్రిక్తతలు పెరుగుతున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.అనిల్ కుమార్ యాదవ్ ఎంతగా హడావుడి చేసినా, జగన్‌ను మెప్పించేందుకు ఎంతటి తీవ్ర వ్యాఖ్యలు చేసినా, రాబోయే రోజుల్లో ఆయనకు నెల్లూరు సిటీ టికెట్ లేదా ఇన్ ఛార్జ్ పదవి దక్కే అవకాశాలు దాదాపు శూన్యమనే ప్రచారం నెల్లూరు రాజకీయాల్లో గట్టిగా సాగుతోంది. స్వపక్షంలోనే సీనియర్ల నుంచి ఎదురవుతున్న తీవ్ర వ్యతిరేకత, అధిష్టానంలో చంద్రశేఖర్ రెడ్డికి ఉన్న ప్రాధాన్యత, జగన్ రాజకీయ వ్యూహాల దృష్ట్యా అనిల్ నెల్లూరు రీ-ఎంట్రీ ఒక కలగానే మిగిలిపోయే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

లోకల్ ఎన్నికల కోసం రిజర్వేషన్ వివాదం



తిరుపతి, : జీవో జారీ చేసినా ఏపీలో లోకల్ బాడీ ఎన్నికలు జరగవు.. బీసీలకు ఇచ్చిన 34 శాతం రిజర్వేషన్లను కోర్టు కొట్టేస్తుంది, ఆ తర్వాత నెపాన్ని న్యాయస్థానాలపైకి నెట్టి ప్రభుత్వం నాటకాడుతుంది అని వైఎస్ఆర్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆరోపణలు గుప్పిస్తున్నారు. మరోవైపు, ఎన్ని న్యాయపరమైన అడ్డంకులు వచ్చినా బీసీలకు 34 శాతం కోటా అమలు చేసి తీరుతాం అని టీడీపీ నాయకత్వం స్పష్టం చేస్తూ 'జయహో బీసీ' సభల ద్వారా తమ బీసీ ఓటు బ్యాంక్‌ను పటిష్టం చేసుకునే పనిలో పడింది. ఈ నేపథ్యంలో రిజర్వేషన్ వివాదం ఏమిటి? చంద్రబాబు సవాలు వెనుక ఉన్న రాజకీయ వ్యూహమేంటి? స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం జీవోలు విడుదల చేసింది. అయితే, సుప్రీంకోర్టు గతంలో పలు తీర్పుల్లో.. ఎస్సీ, ఎస్టీ, బీసీల స్థానిక సంస్థల రిజర్వేషన్ల మొత్తం శాతాన్ని 50 శాతం పరిమితి దాటకూడదని స్పష్టమైన గీత గీసింది. ప్రస్తుతం ఏపీలో ఎస్సీలకు 15%, ఎస్టీలకు 6% రిజర్వేషన్లు ఉన్నందున, బీసీలకు 34% ఇస్తే మొత్తం రిజర్వేషన్లు 55% నుండి 61% వరకు చేరుకుంటాయి. 2019లో కూడా అప్పటి ప్రభుత్వం 34% ఇస్తే హైకోర్టు , సుప్రీంకోర్టులు దాన్ని కొట్టివేశాయి. దీనివల్ల రిజర్వేషన్లు 50% దాటితే న్యాయపరంగా మళ్లీ చిక్కులు వస్తాయన్నది జగన్ వాదనకు ప్రాతిపదిక.చంద్రబాబు నాయుడు అనుభవజ్ఞుడైన నాయకుడు.కోర్టు తీర్పుల పరిమితి ఆయనకు తెలియనిది కాదు. అయినా 34% జీవో ఇవ్వడం వెనుక మూడు ప్రధాన కారణాలు ఉన్నాయి. 2024 ఎన్నికల మేనిఫెస్టోలో బీసీలకు 34% రిజర్వేషన్లు ఇస్తామని కూటమి హామీ ఇచ్చింది. ప్రభుత్వం తమ వైపు నుంచి 34% అమలుకు సిద్ధపడింది అన్న సందేశాన్ని ప్రజలకు ఇవ్వడం. ఒకవేళ కోర్టు దీనిని అడ్డుకుంటే, మేము ఇవ్వాలనుకున్నాం కానీ న్యాయస్థానాల పరిమితుల వల్ల కుదరలేదు అని చెప్పి బీసీల్లో సానుభూతి సాధించడం. సీలు టీడీపీకి సాంప్రదాయ వెన్నెముక. జీవో ఇవ్వడం, సభలు నిర్వహించడం ద్వారా తమ ప్రభుత్వం బీసీల పక్షపాతి అని బలంగా స్థాపించడంవైఎస్ జగన్ విమర్శలు కేవలం న్యాయ సూత్రాల గురించే కావు. దాని వెనుక స్పష్టమైన ప్రతిపక్ష వ్యూహం దాగి ఉంది. 2019-2024 మధ్య వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం 50% పరిమితికి లోబడి బీసీ రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించి ఎన్నికలు నిర్వహించింది. అప్పట్లో టీడీపీ దీనిని బీసీల నోళ్లు కొట్టారు అని విమర్శించింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం 34% జీవో ఇస్తే, తాము గతంలో చేసింది కోర్టు నిబంధనల కోసమేనని నిరూపించుకోవాల్సిన అవసరం జగన్‌కు వచ్చింది. అలాగే, రిజర్వేషన్ల వివాదం వల్ల ఎన్నికలు ఆలస్యమైతే, కూటమి ప్రభుత్వం ఎన్నికల నుంచి పారిపోతోందని ప్రజల్లోకి తీసుకెళ్లాలనేది వైఎస్ఆర్‌సీపీ ఆలోచన.న్యాయ కోణం నుంచి చూస్తే, ఎంపిక చేసిన ప్రాతిపదికన ఎంపిరికల్ డేటా అంటే సామాజిక, ఆర్థిక సర్వే డేటా ఆధారంగా బీసీల వెనుకబాటుతనాన్ని నిరూపిస్తే తప్ప 50% సీలింగ్ దాటడం సాధ్యం కాదు. ఈ విషయంపై ఏపీ హైకోర్టు కూడా ప్రభుత్వం వైపు నుంచి ఆధారాలను, ఎంపిరికల్ డేటాను కోరింది. ప్రత్యేక కమిషన్ల నివేదికలు లేకుండా జీవో ఆధారంగా 50% మించి రిజర్వేషన్లు ఇస్తే, గతం తరహాలోనే న్యాయస్థానాలు దానిని నిలిపివేసే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఏపీ స్థానిక పోరులో బీసీ రిజర్వేషన్ల అంశం చట్టపరమైన సవాలు కంటే రాజకీయ అస్త్రంగా ఎక్కువ ఉపయోగపడుతోంది. 34% కోటాను దక్కించుకోవడం ద్వారా బీసీల గుండెల్లో చెరగని ముద్ర వేయాలని కూటమి ప్రభుత్వం భావిస్తుంటే.. ఇదిసాధ్యం కాని రాజకీయ గిమ్మిక్‌అని తేల్చిచెప్పడం ద్వారా టీడీపీ-బీజేపీ-జనసేనల ఇమేజ్‌ను దెబ్బతీయాలని వైఎస్ఆర్‌సీపీ చూస్తోంది.

జనసేనలో చేరికలకు బ్రేక్...

కాకినాడ, : జనసేన పార్టీ నాయకత్వం ఆత్మవిమర్శ చేసుకోవాల్సి ఉంది. జనసేన లో చేరికలు లేవు. సొంత సామాజికవర్గం నేతలే జనసేనలో చేరకుండా కూటమి లోని టీడీపీలో చేరుతున్నారు. దీనికి కారణం ఏంటి? లోపాలు ఎక్కడ? అన్నదానిపై నమీక్ష చేసుకోవాల్సిన పరిస్థితి ఆసన్నమయింది. తాజాగా ఉత్తరాంధ్రలో జనసేన బలోపేతానికి చిన్న శ్రీనును చేర్చుకోవాల్సి ఉండగా, ఆయన పసుపు కండువా కప్పుకోవడం పార్టీలోనూ చర్చనీయాంశమైంది. నాయకత్వంలో ఏకపక్ష నిర్ణయాలు, తమకు రాజకీయ భవిష్యత్ ఉండదన్న భావన ఎక్కువగా ఉండటం వల్లనే జనసేనలో చేరికలు లేవన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. జనసేన పార్టీలో 2024 ఎన్నికల తర్వాత ఆశించిన స్థాయిలో చేరికలు లేకపోవడానికి, లేదా వలసలపై పార్టీ ఆచితూచి అడుగులు వేయడానికి ముఖ్యమైన కారణాలు ఉన్నాయి. గతంలో చేరికలపై కొన్ని విమర్శలు వచ్చినప్పటికీ, ప్రస్తుతం 2026 నాటికి పవన్ కళ్యాణ్ ప్రత్యేకంగా 14 మంది సభ్యులతో కూడిన 'జాయినింగ్స్ కమిటీ'ని ఏర్పాటు చేసి, పార్టీ బలోపేతంపై ప్రత్యేక దృష్టి సారించారు... ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ, జనసేన, బీజేపీల కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంది. ఇతర పార్టీల నుంచిప్రధానంగా వైసీపీ నేతలను చేర్చుకుంటే, స్థానికంగా ఉన్న టీడీపీ లేదా బీజేపీ నేతలతో వివాదాలు వచ్చే అవకాశం ఉంటుంది. కూటమిలో ఎలాంటి ఘర్షణలు రాకూడదనే ఉద్దేశంతోనే చేరికలపై జనసేన అధినాయకత్వం ఆచితూచి వ్యవహరించింది. కూటమి ఒప్పందంలో భాగంగా జనసేన పరిమిత సంఖ్యలోనే పోటీ చేసింది. భవిష్యత్తులో కూడా సీట్ల సర్దుబాటు ఉంటుంది కాబట్టి, ఇతర నియోజకవర్గాల నుండి పెద్ద నేతలు వచ్చినా వారికి టికెట్లు ఇవ్వడం సాధ్యం కాకపోవచ్చు. ఈ క్లారిటీ ఉండటం వల్లే వలసలు నెమ్మదించాయి. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పటి నుండి జెండా మోసిన పాత నాయకులు, 'వీర మహిళలు', కార్యకర్తలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని పవన్ కళ్యాణ్ భావిస్తున్నారు. ఎన్నికల తర్వాత ఇతర పార్టీల నుండి వచ్చే వలస నేతలకు ప్రాధాన్యత ఇస్తే, సొంత క్యాడర్ అసంతృప్తికి గురవుతుందనే ఆలోచన కూడా ఉంది. గతంలో పార్టీలో చేరిన కొందరు నేతలకు తగిన ప్రాధాన్యత దక్కలేదనే టాక్ నడిచింది.

లోకల్ పోల్స్ కు కాంగ్రెస్ రెడీ...



విజయవాడ: ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సుదీర్ఘకాలంగా సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న కాంగ్రెస్ పార్టీ, రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను వేదికగా చేసుకుని పూర్వవైభవం సాధించేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సారథ్యంలో పార్టీని క్షేత్రస్థాయి నుంచి పునర్నిర్మించే క్రమంలో 10 మంది సీనియర్ నేతలతో కూడిన రాష్ట్ర స్థాయి మానిటరింగ్ కమిటీ ని ఏర్పాటు చేయడం ఆసక్తికరంగా మారింది. ఈ కమిటీకి సీడబ్ల్యూసీ సభ్యుడు, మాజీ పీసీసీ చీఫ్ ఎన్. రఘువీరారెడ్డిని ఛైర్మన్‌గా, మాజీ కేంద్ర మంత్రి జేడీ శీలంను కన్వీనర్‌గా నియమించడం ద్వారా కాంగ్రెస్ తన పాత కాపులను, అనుభవజ్ఞులను మళ్లీ ప్రధాన స్రవంతిలోకి తెచ్చేందుకు తగిన వేదికను సిద్ధం చేసింది.ఈ తాజా నియామకాల్లో ప్రధానంగా ఆకట్టుకుంటున్న అంశం రఘువీరారెడ్డి రీ-ఎంట్రీ. రాష్ట్ర విభజన అనంతరం అత్యంత క్లిష్టమైన పరిస్థితుల్లో పీసీసీ అధ్యక్షుడిగా పార్టీని నడిపిన ఆయన, గత కొంతకాలంగా ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉంటూ ఆధ్యాత్మిక, వ్యవసాయ కార్యక్రమాలకే పరిమితమయ్యారు. అయితే, రాయలసీమతో పాటు రాష్ట్రవ్యాప్తంగా వివాదరహిత నాయకుడిగా, సౌమ్యుడిగా ఆయనకున్న మంచి పేరును వాడుకోవాలని ఏఐసీసీ భావించింది. బిసి, యాదవ సామాజిక వర్గానికి చెందిన సీనియర్ నేతగా, ఉమ్మడి ఏపీలో కీలక మంత్రిత్వ శాఖలు నిర్వహించిన రఘువీరారెడ్డి నాయకత్వం.. సైలెంట్‌గా ఉన్న పాత కాంగ్రెస్ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపే అవకాశం ఉంది.ఈ 10 మంది సభ్యుల కమిటీ ప్రాథమిక విధి కేవలం టికెట్ల కేటాయింపు లేదా కార్యాలయ వ్యవహారాలకే పరిమితం కాదు. సీడబ్ల్యూసీ సభ్యుడు గిడుగు రుద్రరాజు, మాజీ కేంద్ర మంత్రులు పల్లంరాజు, కిల్లి కృపారాణి, తులసిరెడ్డి, షేక్ మస్తాన్ వలి వంటి దిగ్గజాలతో కూడిన ఈ బృందం త్వరలోనే జిల్లాల పర్యటనలకు శ్రీకారం చుట్టనుంది. గత కొన్నేళ్లుగా వైసీపీ, టీడీపీల వైపు వెళ్లిన ద్వితీయ శ్రేణి నేతలను, కాంగ్రెస్‌తో అనుబంధం ఉన్న పాత కుటుంబాలను పరామర్శించడం, తీవ్ర అసంతృప్తితో ఉన్న క్షేత్రస్థాయి శ్రేణులను తిరిగి సొంత గూటికి రప్పించడమే ఈ కమిటీ ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది.రాజకీయ సమీకరణాల పరంగా చూస్తే, ప్రస్తుతం ఏపీలో తీవ్రమైన అధికార-ప్రతిపక్ష పోరు నెలకొంది. ఓవైపు వైఎస్ఆర్‌సీపీ తమ అభ్యర్థులను నిలబెట్టేందుకు కష్టపడుతున్న తరుణంలో, మరోవైపు కూటమి ప్రభుత్వంపై ఉండే సహజ వ్యతిరేకతను లేదా తటస్థ ఓటు బ్యాంకును ఆకర్షించడానికి కాంగ్రెస్‌కు ఇది అనుకూల సమయం. స్థానిక సంస్థల పోరులో పంచాయతీ, మండల, మున్సిపల్ స్థాయిలో బహుముఖ పోటీని సృష్టించడం ద్వారా, రాష్ట్రంలో కనీసం 10 నుండి 15 శాతం ఓటు బ్యాంకును తిరిగి సాధించవచ్చని పార్టీ అంచనా వేస్తోంది. వైఎస్సార్ వారసత్వం కార్డ్‌ను షర్మిల వాడుతుండగా, పాత కాంగ్రెస్ పునాదుల ను రఘువీరా బృందం బలోపేతం చేసే ప్రయత్నం చేస్తోంది.కాంగ్రెస్ బాటలో సవాళ్లు తక్కువగానేమీ లేవు. క్షేత్రస్థాయిలో పార్టీకి ఆర్థికంగా, అంగబలంతో అండగా నిలిచే నాయకత్వం దాదాపు కనుమరుగైంది. ఎన్నికల నిర్వహణ వ్యయం విపరీతంగా పెరిగిన నేపథ్యంలో, గెలుపు గుర్రాలను వెతికి పట్టుకోవడం ఈ కమిటీకి అతిపెద్ద అగ్నిపరీక్ష. అలాగే రఘువీరారెడ్డి సుదీర్ఘ విరామం తర్వాత క్షేత్రస్థాయిలో ఎంతవరకు పర్యటించి, నేతలలో ఆత్మవిశ్వాసాన్ని నింపగలరనేది కూడా కీలకం. ఏది ఏమైనా, సరైన వ్యూహం లేకుండా ఎన్నికలకు వెళ్లే విధానానికి స్వస్తి పలికి, ముందుగానే పక్కా కసరత్తు ప్రారంభించడం కాంగ్రెస్ సాధించిన సానుకూల పరిణామంగానే చెప్పాలి.రఘువీరారెడ్డి నేతృత్వంలోని ఈ హైపవర్ కమిటీ ఏపీ కాంగ్రెస్‌కు ఎంతవరకు సంజీవని గా మారుతుందో వేచి చూడాలి. అధికారంలో ఉన్న కూటమిని, ప్రధాన ప్రతిపక్షమైన వైఎస్ఆర్‌సీపీని తట్టుకుని స్థానిక పోరులో స్థానాలు గెలుచుకుంటేనే 2029 సార్వత్రిక ఎన్నికల నాటికి ఏపీలో కాంగ్రెస్ పునరుజ్జీవనానికి పునాది పడుతుంది.

కల్తీ నెయ్యి... అడ్డంగా దొరికినట్టేనా!



తిరుమల : తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం కల్తీ నెయ్యి వ్యవహారంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ వెల్లడించిన దర్యాప్తు వివరాలను పట్టుకుని వైఎస్సార్‌సీపీ చేస్తున్న ప్రచారం ఆ పార్టీకే రాజకీయంగా, నైతికంగా తీవ్రమైన సెల్ఫ్ గోల్‌గా మారుతోంది. సుకృతి ఫుడ్స్ ప్రమోటర్ కైలాష్ చంద్ మంగ్లాను అరెస్ట్ చేసిన ఈడీ.. టీటీడీకి సరఫరా చేసిన నెయ్యిలో పామాయిల్, పామ్ కెర్నల్ ఆయిల్, ఎంజీ-90, మైవాసెట్ సాఫ్ట్ 400 వంటి ప్రమాదకర రసాయనాలు కలిపారని స్పష్టం చేసింది. అయితే, ఇందులో జంతు కొవ్వు ప్రస్తావన లేదన్న ఒకే ఒక్క పాయింట్‌ను పట్టుకుని, చూశారా మేం జంతు కొవ్వు వాడలేదు, మాపై తప్పుడు ఆరోపణలు చేశారు అంటూ వైసీపీ నేతలు సంబరాలు చేసుకోవడం, ఊరట పొందుతున్నట్లు ప్రకటనలు విడుదల చేయడం తీవ్ర విస్మయానికి గురిచేస్తోంది.ఈ రకమైన సమర్థన ద్వారా ఐదేళ్ల తమ హయాంలో తిరుమలకు నకిలీ, విష రసాయనాల నెయ్యి సరఫరా జరిగిందన్న దారుణ సత్యాన్ని వైఎస్సార్‌సీపీ పరోక్షంగా నూటికి నూరు శాతం అధికారికంగా అంగీకరించినట్లయింది. ప్రాథమికంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అనేది ఒక ఆర్థిక నేరాల దర్యాప్తు సంస్థ మాత్రమే. ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్ పరిధిలో అక్రమ నగదు లావాదేవీలు, డొల్ల కంపెనీలు, కల్తీ సరుకు కొనుగోళ్ల ముసుగులో జరిగిన నిధుల మళ్లింపును నిగ్గుతేల్చడమే దాని పని. నెయ్యిలో జంతు కొవ్వు ఉందా, లేదా అనేది తేల్చాల్సింది ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ , ప్రత్యేక ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లు, కోర్టు పరిధిలోని సిట్ దర్యాప్తు మాత్రమే తప్ప, అది ఈడీ పరిధిలోని అంశం కాదు.

అలాంటప్పుడు ఈడీ రిపోర్టులో జంతు కొవ్వు పేరు రాలేదని సంబరాలు చేసుకోవడం ప్రజల దృష్టిని మళ్లించే కుట్ర.ఈడీ మోపిన 230 కోట్ల అక్రమ దందా, ఫేక్ రికార్డులు, విషపూరిత కెమికల్స్‌తో కూడిన తయారీ ఆరోపణలను వైసీపీ పూర్తిగా ఒప్పేసుకున్నట్లే అవుతోంది. భారతీయ సంస్కృతిలో, హిందూ ధర్మంలో తిరుమల వేంకటేశ్వర స్వామికి సమర్పించే నైవేద్యం పవిత్రమైనది. దేశవిదేశాల నుంచి కోట్ల మంది భక్తులు పరమ భక్తితో స్వీకరించే లడ్డూ ప్రసాదంలో ఆవు నెయ్యి స్థానంలో రీఫైన్డ్ పామాయిల్, మోనోగ్లిజరైడ్స్ వంటి పారిశ్రామిక రసాయనాలను కలిపి అంటగట్టడం కలియుగ దైవానికి చేసిన క్షమించరాని మహాపచారం కాదా? మేము విష రసాయనాలు మాత్రమే వాడాము తప్ప జంతు కొవ్వు వాడలేదని వాదించడం ఎంతటి దిగజారుడుతనం? కల్తీ జరిగిందని నిర్ధారణ అయినప్పుడు, అది ఏ రూపంలో ఉన్నా భక్తుల మనోభావాలను, దైవ పవిత్రతను తీవ్రంగా దెబ్బతీసిన ఘోర నేరమే అవుతుంది.మనీలాండరింగ్ కోణంలో 230 కోట్ల కుంభకోణం జరిగిందని, అందులో 96 కోట్ల విలువైన కల్తీ రసాయన నెయ్యి ఒక్క కంపెనీ నుంచే సరఫరా అయిందని ఈడీ తేల్చింది. పాల సేకరణే లేని ఫ్యాక్టరీల నుంచి ట్యాంకర్ల కొద్దీ కెమికల్ లిక్విడ్ తిరుమల కొండపైకి చేరుతుంటే అప్పటి పాలకమండలి పెద్దలు ఏం చేస్తున్నారు? ఈ అక్రమ రవాణాలో టీటీడీ అధికారులకు, రాజకీయ పెద్దలకు అందిన ముడుపుల మాటేమిటి? శ్రీవారి భక్తుల మనోభావాలతో చెలగాటమాడి, ఆరోగ్యాన్ని పణంగా పెట్టి వేల కోట్ల ప్రజాధనాన్ని కొల్లగొట్టిన ఈ ముఠాకు చట్టపరంగా పడే సాధారణ శిక్షలు సరిపోవు.

రూ.230 కోట్ల విలువైన కల్తీ నెయ్యి సరఫరా

తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం కోసం ఏకంగా రూ.230 కోట్ల విలువైన కల్తీ నెయ్యి సరఫరా జరిగిందని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ప్రకటించిది. ఇది కేవలం వ్యాపారుల స్వార్థం మాత్రమే ఉందంటే సామాన్యులు కూడా నమ్మే పరిస్థితి లేదు. సుకృతి ఫుడ్స్ ప్రమోటర్ కైలాష్ చంద్ మంగ్లా, భోలే బాబా డెయిరీ విపిన్ జైన్ వంటి వ్యాపారులు నెయ్యి స్థానంలో పామాయిల్, కెమికల్స్ కలిపారన్నది సాంకేతిక ఆధారాలతో తేలింది. కానీ, నిత్యం కఠిన నిబంధనలు, ల్యాబ్ టెస్టులు, సెక్యూరిటీ ఉండే తిరుమల వంటి పరమ పవిత్ర పుణ్యక్షేత్రంలోకి ఏళ్ల తరబడి ఎలాంటి అడ్డంకులు లేకుండా ట్యాంకర్ల కొద్దీ విషపూరిత నెయ్యి ప్రవేశించిందంటే.. కచ్చితంగా త్యున్నత రాజకీయ అండదండలు లేకుండా ఇది సాధ్యమయ్యే పనేనా ?ఈ ప్రశ్నకు మరింత బలాన్ని చేకూరుస్తోంది టీటీడీ మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి వ్యక్తిగత సహాయకుడు కడూరు చిన్న అప్పన్న వ్యవహారం. నెయ్యి సరఫరా చేసే డెయిరీ కాంట్రాక్టర్ల వద్ద కిలో నెయ్యికి 25 చొప్పున కమిషన్ డిమాండ్ చేశారన్న అభియోగాలతో ఇప్పటికే ప్రత్యేక దర్యాప్తు బృందం అప్పన్నను ఏ-24గా అరెస్ట్ చేసి జైలుకు పంపింది. లంచం ఇవ్వడానికి నిరాకరించిన డెయిరీలను నిబంధనల పేరుతో బెదిరించి బ్లాక్‌లిస్ట్‌లో పెట్టించడం, కమిషన్లు ముట్టజెప్పిన కంపెనీలకు రేట్లు పెంచి కాంట్రాక్టులు కట్టబెట్టడం, హవాలా ద్వారా కోట్లాది రూపాయల ముడుపులు అందుకోవడం వంటి అంశాలపై సిట్ ఆధారాలు సేకరించింది. పూరి గుడిసె నేపథ్యం ఉన్న ఒక సాధారణ పీఏ ఖాతాల్లోకి, బినామీ ఆస్తుల్లోకి కోట్ల రూపాయల నిధులు ఎలా చేరాయన్నది ఈ వ్యవహారంలో అసలు గుట్టును బయటపెడుతోంది. చైర్మన్ పీఏ ? చైర్మన్ చెప్పకుండా చేయగలడా?

అయితే ఇక్కడే అసలైన రాజకీయ, పరిపాలనాపరమైన ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఒక చైర్మన్ పీఏ స్థాయి వ్యక్తి ఇంతటి మెగా కుంభకోణాన్ని సొంత పూచీకత్తుతో నడిపించగలడా? డెయిరీలను బెదిరించడం, టీటీడీ కొనుగోలు విభాగం అధికారులను ఆదేశించడం, టెండర్లలో నిబంధనలు మార్చేలా ఒత్తిడి తేవడం ఆయన ఒక్కడి వల్లే అయ్యే పనేనా? వైవీ సుబ్బారెడ్డి పేరును, ఆయన అధికారాన్ని వాడుకోకుండా బోర్డు పరిధిలోని వ్యవహారాలను ఒక పీఏ శాసించడం అసాధ్యమనేది బహిరంగ రహస్యం. గతంలో కల్తీ గురించి ఫిర్యాదులు, ల్యాబ్ నివేదికలు వచ్చినా బుట్టదాఖలు కావడం వెనుక తిరుమల పాలకమండలి పెద్దల మౌనమే రక్షణ కవచంగా నిలిచిందన్న విమర్శలు బలంగా ఉన్నాయి.ప్రస్తుతం సిట్ అప్పన్నను అదుపులోకి తీసుకుని విచారించగా, ఈడీ మాత్రం కైలాష్ మంగ్లా, విపిన్ జైన్ వంటి తయారీదారులను అరెస్ట్ చేస్తూ పీఎంఎల్ఏ చట్టం కింద మనీ ట్రయల్‌ను ఛేదిస్తోంది. కల్తీ నెయ్యి వ్యాపారులు సృష్టించిన నల్లధనం ఎవరెవరి ఖాతాల్లోకి వెళ్లింది, ఎవరికి కమిషన్లుగా ముట్టింది అనే బ్యాంకింగ్, హవాలా లింకులు బయటకు వస్తే.. ఆ దర్యాప్తు ముగింపు అప్పన్న వద్దే ఆగిపోవడం అసాధ్యం. అప్పన్న ద్వారా ఆ ముడుపులు ఎవరి గడప దాటాయి, టీటీడీ అప్పటి ఉన్నతాధికారులు, బోర్డు చైర్మన్ కార్యాలయానికి దీనితో ఉన్న లంకె ఏమిటన్నది తేలక తప్పదు.


జనసేన తీర్థానికి వైఎస్ఆర్‌సీపీ సీనియర్ల దూరమా



ఒంగోలు : ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వైఎస్ఆర్‌సీపీ ప్రాధాన్యం క్రమంగా తగ్గుతున్న క్రమంలో, ఆ పార్టీకి చెందిన పలువురు సీనియర్ నాయకులు గుడ్‌బై చెబుతూ కొత్త దారులు వెతుక్కుంటున్నారు. విజయనగరం జిల్లా జడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు వైఎస్ఆర్‌సీపీకి రాజీనామా చేసిన వెంటనే నేరుగా టీడీపీ గూటికి చేరడం చర్చనీయాంశం అయింది. ప్రతిపక్షం నుంచి బయటకు వస్తున్న నేతలకు కూటమి రూపంలో రెండు వేదికలు అందుబాటులో ఉన్నప్పటికీ, మెజారిటీ నాయకులు జనసేన వైపు చూడకుండా కేవలం తెలుగుదేశం వైపే మొగ్గు చూపడానికి ఆసక్తి చూపిస్తున్నారు. ఈ పరిస్థితికి ప్రధాన కారణం జనసేనలో చేరిన తర్వాత లభిస్తుందనుకున్న ప్రాధాన్యత పై రాజకీయ నేతలకు ఉన్న అనుమానాలే. వైఎస్ఆర్‌సీపీ నుంచి బయటకు వచ్చి జనసేన తీర్థం పుచ్చుకున్న మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ఉదంతం ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణగా నిలుస్తోంది. రాయలసీమ , ప్రకాశం జిల్లా రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం ఉన్న బాలినేని వంటి సీనియర్ నేత జనసేనలో చేరినప్పటికీ, ఆయనకు క్షేత్రస్థాయిలో ఆశించిన స్థాయిలో ప్రాధాన్యత లభించడం లేదనే అభిప్రాయం ఉంది. పైగా ఒంగోలు పరిసర నియోజకవర్గాల్లో కూటమి భాగస్వామి అయిన టీడీపీ స్థానిక నేతలతో బాలినేనికి తరచూ విభేదాలు రావడం, కూటమి శ్రేణుల మధ్య ఘర్షణలు వాతావరణం నెలకొనడం వంటివి ఆయనకు మరింత ఇరకాటంగా మారాయి.జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పార్టీ విషయంలో అనుసరిస్తున్న కఠినమైన ఫిల్టరింగ్ విధానం కూడా ఈ వలసల వేగాన్ని తగ్గించింది. అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీలోకి వచ్చే వారి విషయంలో పవన్ జాగ్రత్తలు వహిస్తున్నారు. గతంలో జనసేనను, పవన్ కళ్యాణ్‌ను వ్యక్తిగతంగా తీవ్రస్థాయిలో విమర్శించిన వైఎస్ఆర్‌సీపీ నేతలను, ,నియోజకవర్గాల్లో వివాదాస్పద ఇమేజ్ ఉన్న వారిని పార్టీలోకి చేర్చుకోవడానికి ఆయన సుముఖంగా లేరు. దీంతో పార్టీలోకి రావాలని ఆశపడే నేతలకు కనీసం గ్రీన్ సిగ్నల్ కూడా లభించని పరిస్థితి నెలకొంది. అధికారిక ప్రాధాన్యత , నియోజకవర్గాల్లో పట్టు సాధించే క్రమంలో టీడీపీయే సరైన వేదిక అని జంపింగ్ నేతలు భావిస్తున్నారు. పాత వైఎస్ఆర్‌సీపీ నేతలకు నియోజకవర్గ స్థాయి వ్యవస్థలపై, అధికారులపై ప్రభావం చూపగలిగే బలమైన కేడర్ అవసరం. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని టీడీపీకి గ్రామస్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు బలమైన యంత్రాంగం ఉంది. జనసేన ఓటు బ్యాంకు బలమైనదే అయినప్పటికీ, నియోజకవర్గంలో రాజకీయం నడపాలంటే టీడీపీ అధికారిక చక్రం కింద ఉండటమే రక్షణ అని సీనియర్ నాయకులు లెక్కింపులు వేస్తున్నారు.జనసేన అంతర్గత నిర్మాణం, నిర్ణయాల ప్రక్రియ కూడా ఇక్కడ ఒక అంశంగా మారింది. పవన్ కళ్యాణ్ చుట్టూ ఉన్న కోటరీ , పరిమితమైన పార్టీ పదవుల కేటాయింపు వల్ల, కొత్తగా చేరే వైఎస్ఆర్‌సీపీ మాజీ సీనియర్లకు సముచిత స్థానం దక్కుతుందా లేదా అనే సంశయం ఉండిపోయింది. బాలినేని శ్రీనివాసరెడ్డి ఉదంతాన్ని చూసిన తర్వాత చాలామంది వైఎస్ఆర్‌సీపీ సీనియర్లు జనసేనలోకి వెళ్లి మూలన పడేకంటే, నేరుగా టీడీపీలోకి వెళ్లి తమ ఉనికిని చాటుకోవడమే మేలు అనే ముగింపునకు వచ్చినట్లు కనిపిస్తోంది.

ఈ పరిణామాలు క్షేత్రస్థాయిలో జనసేన విస్తరణకు కొంత అడ్డంకిగా మారినప్పటికీ, స్వచ్ఛమైన ఇమేజ్ ఉన్నవారినే పార్టీలోకి తీసుకోకూడదనే పవన్ కళ్యాణ్ వ్యూహం సుదీర్ఘకాలంలో పార్టీ సిద్ధాంతానికి మేలు చేస్తుందని జనసేన వర్గాలు వాదిస్తున్నాయి. అయితే, ప్రతిపక్ష వైఎస్ఆర్‌సీపీ బలహీనపడుతున్న ఈ కీలక సమయంలో వలసొచ్చే బలమైన నేతలను ఆకర్షించడంలో జనసేన వెనుకబడితే, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ద్వితీయ శ్రేణి నాయకత్వాన్ని నిర్మించుకోవడం ఆ పార్టీకి అతిపెద్ద సవాలుగా మారే అవకాశముంది.

మిడిల్ క్లాసు కష్టాలు...



హైదరాబాద్: ఒకటో తారీకు జీతం వస్తుంది. ఆ తర్వాత ఈఎంఐ కట్టాలి. క్రెడిట్ కార్డు బిల్లు కట్టాలి.. ఇంటి రెంట్ కట్టాలి. పిల్లల స్కూల్ ఫీజులు కట్టాలి. నెలవారి ఖర్చుకు ఎంతోకొంత ఎకౌంట్లో ఉంచుకోవాలి. ఇవన్నీ చేసిన తర్వాత ఏం మిగులుతుంది..జీతం ఆవగింజంత ఉంటే.. ఖర్చులు మామిడికాయ సైజులో ఉంది. ఇలాంటప్పుడు నాలుగు రాళ్లు వెనక వేయడం కాదు కదా.. కనీసం జీవితాన్ని ముందుకు సాగించడం కూడా కష్టమే. నచ్చినవి తినలేము. ఇష్టమైన వాటిని కొనుగోలు చేయలేము. బాగున్న వాటిని సొంతం చేసుకోలేము. ఊహల్లో బతకడం.. కష్టాలను తిట్టుకోవడం.. ఇదే మిడిల్ క్లాస్ జీవితం..మనదేశంలో పేదవాళ్లు ఒక అంచనాలో బతుకుతారు. డబ్బున్న వాళ్లు కూడా ఒక అంచనాలో బతుకుతారు. కానీ మిడిల్ క్లాస్ వాళ్ళు ఎటువంటి అంచనా వేసుకోలేరు. ఎందుకంటే వాళ్లకు ప్రతి విషయంలోనూ ఇబ్బందులు ఎదురవుతుంటాయి. ఏవైనా నిర్ణయాలు తీసుకోవాలంటే ఆర్థికంగా ఇబ్బందులు తప్పవని.. ముందుగానే జాగ్రత్త పడతారు. జాగ్రత్తగా ఉన్నంత మాత్రాన ఖర్చులు ఆగవు కదా.ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో జీవించే మిడిల్ క్లాస్ వాళ్లకు ప్రతిరోజు ఒక పజిల్ మాదిరిగానే ఉంటుంది. అక్కడ జీవించే మిడిల్ క్లాస్ ప్రజల కష్టాల మీద ఒక వ్యక్తి చేసిన వీడియో సోషల్ మీడియాలో సంచలనం కలిగిస్తోంది. ఈఎంఐ.. కిరాయిలు.. కుటుంబ ఖర్చులు.. వీటన్నింటికీ జీతం సరిపోక కనీసం మటన్ కూడా కొనుగోలు చేయడం కష్టమవుతుంది. జీవితంలో ఎటువంటి ఎదుగుదల లేకుండా.. పెళ్లి జరిగిన తర్వాత.. పిల్లలు పుట్టిన తర్వాత.. వారి బాధ్యతలతోనే జీవితం సంకనాకి పోతుందని.. ఆ వీడియోలో ఉన్న వ్యక్తి చెప్పాడు. ఈ వీడియోను చాలామంది తమకు అనుకూలంగా ఉందని వ్యాఖ్యానిస్తున్నారు. తమది కూడా ఇటువంటి దుస్థితేనని వాపోతున్నారు. మా మనసులో ఉన్న బాధను మొత్తం వ్యక్తం చేశావని చాలామంది కామెంట్లు చేస్తున్నారు.గతంతో పోల్చి చూస్తే హైదరాబాద్ నగరంలో మిడిల్ క్లాస్ వల్ల కష్టాలు విపరీతంగా పెరిగిపోయాయి. అన్ని ఖర్చులు పెరిగిపోవడం.. వాటికి తగ్గట్టుగా వేతనాలు పెరగపోవడంతో చాలామంది ఆర్థికంగా కష్టాలు పడుతూనే ఉన్నారు. పెళ్లి.. పిల్లలు.. బాధ్యతలు.. ఇవన్నీ కళ్ళ ముందు కనిపిస్తుంటాయి కాబట్టి.. చాలామంది కష్టాలను పంటి కింద భరిస్తూ.. తమ ఇబ్బందులను తిట్టుకుంటూ జీవితాన్ని సాగిస్తుంటారు. ఎందుకంటే అంతకుమించి చేయడానికి మిడిల్ క్లాస్ వాళ్లకు అవకాశం లేదు.

100 శాతం స్ట్రైక్ రేటుపై గురి...

కాకినాడ : ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగబోయే మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికల సమరానికి జనసేన పార్టీ అత్యంత పకడ్బందీ వ్యూహాన్ని రచిస్తోంది. పొత్తుల రాజకీయంలో సీట్ల సంఖ్య కోసం వెంపర్లాడే సాంప్రదాయ ధోరణికి భిన్నంగా.. పోటీ చేసిన ప్రతిచోటా గెలిచి తీరాలనే దృఢ నిశ్చయంతో అడుగులు వేస్తోంది. విశాఖపట్నంలో జరిగిన పార్టీ ఆత్మీయ సమావేశంలో పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ చేసిన వ్యాఖ్యలు జనసేన క్షేత్రస్థాయి వ్యూహాన్ని స్పష్టం చేశాయి. మనం తీసుకునే ప్రతిదీ గెలిచే సీటే తీసుకుందాం. కేడర్ నుంచి ఒత్తిడి ఉంది కదా అని గుడ్డిగా 60, 70 లేదా 120 సీట్లు తీసుకోము అని తేల్చిచెప్పడం ద్వారా.. సీట్ల సంఖ్య కంటే గెలుపు గుర్రాలపైనే పార్టీ పూర్తి దృష్టి పెట్టిందన్న స్పష్టమైన సంకేతాన్ని శ్రేణులకు ఇచ్చారు.సార్వత్రిక ఎన్నికల్లో 21 అసెంబ్లీ, 2 ఎంపీ స్థానాల్లో పోటీ చేసి 100 శాతం స్ట్రైక్ రేట్ సాధించిన రికార్డును స్థానిక సమరంలోనూ పునరావృతం చేయడమే పార్టీ ప్రధాన అజెండాగా కనిపిస్తోంది. గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తీవ్ర నిర్బంధాలు, బెదిరింపులను ఎదుర్కొంటూనే విశాఖ కార్పొరేషన్‌లో 3 వార్డులు గెలవడంతో పాటు 7 చోట్ల రెండో స్థానంలో నిలిచిన చరిత్రను పార్టీ గుర్తుచేసుకుంటోంది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండటం, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పాలనాపరమైన పనితీరు ప్రజల్లో సానుకూలతను పెంచిన వేళ.. క్షేత్రస్థాయిలో పార్టీకి తిరుగులేని పట్టున్న వార్డులు, డివిజన్లను గుర్తించి అక్కడ మాత్రమే పూర్తి బలంతో బరిలోకి దిగాలని అధినాయకత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది.కూటమిలో భాగస్వామిగా ఉంటూ అనవసర డిమాండ్లతో సమన్వయాన్ని దెబ్బతీయకుండా, వాస్తవ బలాబలాల ఆధారంగానే సీట్ల సర్దుబాటు ఉండాలనేది జనసేన లైన్. ఏదో ప్రభావం చూపే స్థానంలో ఉన్నాం కదా అని మిత్రపక్షాలపై ఒత్తిడి తెచ్చి ఎక్కువ సీట్లు తీసుకోవడం.. ఆ తర్వాత సమన్వయం లేక లేదా అభ్యర్థుల బలహీనత వల్ల చేజేతులా ఓడిపోవడం వంటి తప్పులకు జనసేన తావివ్వదలుచుకోలేదు. స్థానిక సమస్యలపై పట్టు, ప్రజల్లో నిరంతరం ఉండే నాయకత్వం, గెలిచే సత్తా ఉన్న అభ్యర్థులు ఉన్న చోట మాత్రమే కూటమి తరఫున జనసేన సీట్లను క్లెయిమ్ చేయాలని నిర్ణయించింది. ఇది అటు కూటమి ఐక్యతను కాపాడటంతో పాటు, ప్రత్యర్థి వైఎస్సార్‌సీపీకి ఏ ఒక్క స్థానంలోనూ పట్టు చిక్కకుండా చేసే వ్యూహాత్మక ఎత్తుగడ.పార్టీ శ్రేణులకు నాయకత్వం ముందస్తు హెచ్చరికలు కూడా జారీ చేసింది. టికెట్ రాగానే గెలిచేసినట్లు భావించే అతివిశ్వాసం వద్దని, సోషల్ మీడియాలో వచ్చే అనవసర ప్రచారాలు, సీట్ల సంఖ్యపై సాగే చర్చలను పట్టించుకోవద్దని తేల్చిచెప్పింది. అధినేత పవన్ కళ్యాణ్ నిర్ణయమే తుది నిర్ణయమని, పార్టీ ఎక్కడ పోటీ చేసినా అక్కడ జనసేన-టీడీపీ-బీజేపీ కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పనిచేయాలని కేడర్‌కు స్పష్టం చేశారు. సంఖ్యతో కూడిన డాంబికాల కంటే.. పోటీ చేసిన ప్రతి స్థానంలోనూ విజయకేతనం ఎగురవేసి అన్‌బీటెన్ బ్రాండ్‌ను కాపాడుకోవడమే జనసేన అసలైన స్థానిక మంత్రంగా కనిపిస్తోంది.

బోర్ రిపేర్ చేయించడంలో నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులు!

గోపవరం, : స్థానిక మండల పరిధిలోని చిన్న గోపవరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నందు తాగటానికి నీళ్లు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని, పాఠశాలలో చెడిపోయిన బోరును వెంటనే రిపేరు చేయించాలని డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.కె.మస్తాన్ షరీఫ్, ఎస్.కె.ఆదిల్ డిమాండ్ చేశారు.సోమవారం ఉదయం గోపవరం ఎంపీడీవో కార్యాలయం వద్ద డివైఎఫ్ఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టి, అనంతరం ఎంపీడీవో కు వినతి పత్రంసమర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోపవరం మండలంలోని చిన్న గోపవరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బోరు చెడిపోయి 20 రోజులు కావస్తున్నదని, దీంతో విద్యార్థులు తాగటానికి నీళ్లు లేక తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారన్నారు. ఈ విషయంపై ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మండల పరిషత్ అభివృద్ధి అధికారి వారికి రాతపూర్వకంగా తెలియజేస్తూ, బోర్ ను తక్షణమే రిపేరు చేయించాలని కోరినప్పటికీ అధికారులు స్పందించ లేదన్నారు.బోరును మరమ్మత్తు చేయించడం పెద్ద ఖర్చుతో కూడుకున్నది కాకపోయినప్పటికీ అధికారులు అలసత్వం వహించడం తగదన్నారు. అధికారుల వైఖరి వల్ల ప్రాథమిక స్థాయి విద్యార్థులు తాగటానికి నీళ్లు లేక భోజన సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు తక్షణం స్పందించి బోర్ రిపేర్ చేపించి విద్యార్థులకు తాగునీటి వసతిని కల్పించాలని వారు కోరారు. దీంతోపాటు పి.పి కుంట లోని పాఠశాలలో కూడా తాగు నీరు లేక విద్యార్థులు ఇబ్బందులు పడు తున్నారని వారు తెలిపారు. అధికారులు తక్షణం స్పందించి నీటి సమస్యను పరిష్కరించకపోతే డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ మహిళా కన్వీనర్ ఎస్కే ఫాతిమా పట్టణ ఉపాధ్యక్షులు నాగేంద్రబాబు, సహాయ కార్యదర్శి సుధాకర్ నాయకులు విజయ్, నిహార్, హర్షిత్, సన్నీ,

వేప ఆకుల నమలితే శరీరంలో జరిగే మార్పు ఇదే!



కొన్ని మూలికలు చాలా ప్రభావవంతంగా ఉంటాయి. వాటిని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల ఒకేసారి ఎన్నోరకాల వ్యాధులకు చికిత్స చేయడంలో సహాయపడుతుంది. వేప అటువంటి ఆయుర్వేద మూలికలలో ఒకటి. ఇది చర్మం నుండి శరీరం వరకు అనేక ముఖ్యమైన అవయవాల ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఉపయోగకరంగా ఉంటుంది. ఆయుర్వేదం ప్రకారం, ఎండాకాలంలో వేప పువ్వులు తినడం వల్ల శరీరం ప్రశాంతంగా ఉంటుంది. ఈ పువ్వులు పిత్తను శాంతపరుస్తాయని చెబుతారు. ఈ కారణంగా, దక్షిణ భారతదేశంలో వేసవి ప్రారంభంలో వీటిని తింటారు. వేపలో యాంటీఆక్సిడెంట్, యాంటీ బాక్టీరియల్, యాంటీ ఇన్ఫ్లమేటరీ, ఇమ్యునోమోడ్యులేటరీ లక్షణాలు ఉన్నాయి. ఈ మూలిక రక్తాన్ని శుద్ధి చేస్తుంది. జీర్ణవ్యవస్థను మెరుగుపరుస్తుంది. చర్మ ఛాయను మెరుగుపరుస్తుంది. దీనిని తీసుకోవడం వల్ల కురుపులు, రింగ్‌వా, దురద వంటి చర్మ సమస్యలకు చికిత్స చేయడంలో సహాయపడుతుంది.

వేపను చేదుగా భావిస్తారు. కానీ, ఆయుర్వేదంలో చాలా ప్రయోజనకరమైన ఔషధంగా భావిస్తారు. ఖాళీ కడుపుతో వేప ఆకులను నమలడం ఆరోగ్యానికి అనేక విధాలుగా మేలు చేస్తుంది. వేప ఆకులను నమలడం వల్ల రక్తం శుద్ధి అవుతుంది. చర్మ సంబంధిత సమస్యలు తగ్గుతాయి. ఇది నోటి కుహరంలోని బ్యాక్టీరియాను చంపి దంతాలు, చిగుళ్ళను బలవరుస్తుంది. వేప తినడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. కడుపులో గ్యాస్, ఆమ్లత్వం తగ్గుతుంది. డయాబెటిస్‌లో రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించడంలో ఇది సహాయకరంగా పరిగణించబడుతుంది. వేప ఆకులు రోగనిరోధక శక్తిని పెంచుతాయి. శరీరాన్ని ఇన్ఫెక్షన్ల నుండి రక్షిస్తాయి. దీని రెగ్యులర్ వినియోగం శరీరాన్ని లోపలి నుండి శుభ్రంగా, ఆరోగ్యంగా ఉంచుతుంది. వేప ఆకులను తినడం వల్ల రక్తంలో చక్కెర, రక్తపోటు, కాలేయ ఆరోగ్యం మెరుగుపడుతుంది.

ఆయుర్వేదంలో వేప ఆకులు, పువ్వుల రసం లేదా కషాయాన్ని రోగనిరోధక శక్తిని పెంచడానికి, దీర్ఘకాలిక వ్యాధులను నివారించడానికి, శరీరాన్ని శుభ్రపరచడానికి క్రమం తప్పకుండా తీసుకుంటారు. వేపను మాత్రమే కాకుండా కలకండతో కలిపి కూడా తీసుకోవడం వల్ల దాని ప్రయోజనాలు పెరుగుతాయి. ఈ రెండు పదార్థాలు శరీరాన్ని చల్లబరుస్తాయి. వేడి సంబంధిత సమస్యలను తగ్గిస్తాయి. అంతర్గత బలహీనతను తగ్గిస్తాయి. ఇది రోగనిరోధక శక్తిని మెరుగుపరిచే, దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించే యాంటీఆక్సిడెంట్, యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలను కలిగి ఉంటుంది.

టీ తాగేటప్పుడు ఈ పొరపాట్లు చేస్తున్నారా?



ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రజాదరణ పొందిన పానీయాల్లో టీ (తేనీరు) ఒకటి. ముఖ్యంగా భారతదేశంలో చాలా మంది ఉదయాన్నే ఒక కప్పు టీతో రోజును ప్రారంభిస్తారు. శరీరానికి ఉత్సాహాన్ని, మనసుకు చైతన్యాన్ని అందించే టీ ఆరోగ్యానికి కూడా కొన్ని ప్రయోజనాలను అందిస్తుంది. అయితే టీ తయారుచేసే విధానం లేదా తాగే సమయంలో చేసే కొన్ని పొరపాట్లు ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. టీ అంటే చాలా మందికి అమితమైన ఇష్టం. ఉదయం నిద్రలేచిన వెంటనే ఒక కప్పు వేడి టీ తాగితేనే రోజు ప్రారంభమైన భావన కలుగుతుంది. శరీరానికి, మనసుకు ఉత్సాహాన్ని అందించే ఈ పానీయం మన దైనందిన జీవితంలో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. అయితే టీ తయారీ లేదా టీ తాగే సమయంలో చేసే కొన్ని సాధారణ పొరపాట్లు ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. చాలా మందికి ఉదయం నిద్రలేవగానే ఖాళీ కడుపుతో టీ తాగే అలవాటు ఉంటుంది. అయితే ఇలా చేయడం వల్ల టీలోని ఆమ్ల పదార్థాలు కడుపు లోపలి పొరను ప్రభావితం చేసే అవకాశం ఉంది. దీంతో గుండెల్లో మంట, అజీర్ణం, ఆకలి తగ్గడం వంటి సమస్యలు తలెత్తవచ్చు. అందుకే ఉదయం ముందుగా ఒక గ్లాసు నీరు లేదా జీలకర్ర కలిపిన గోరువెచ్చని నీరు తాగి, అల్పాహారం తర్వాత టీ తీసుకోవడం మంచిది. టీ రుచి బాగా రావాలనే ఉద్దేశంతో కొందరు టీ పొడిని ఎక్కువసేపు నీటిలో మరిగిస్తుంటారు. కానీ ఇలా చేయడం వల్ల 'టానిన్' అనే పదార్థం అధికంగా విడుదలై టీ చేదుగా మారుతుంది. అంతేకాకుండా కడుపు ఉబ్బరం, అజీర్ణం వంటి సమస్యలకు కూడా కారణమవుతుంది. అలాగే టీని వడకట్టేందుకు చాలామంది ప్లాస్టిక్ జల్లెడలను ఉపయోగిస్తుంటారు. అయితే వేడి టీతో ప్లాస్టిక్‌లోని కొన్ని రసాయనాలు కలిసే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. దీర్ఘకాలంలో ఇవి ఆరోగ్య సమస్యలకు దారితీయవచ్చు. అందువల్ల ప్లాస్టిక్ జల్లెడల బదులుగా స్టీల్ జల్లెడలను ఉపయోగించడం ఉత్తమం. ఒకసారి తయారైన టీని పదేపదే వేడి చేసి తాగడం కూడా ఆరోగ్యానికి మంచిది కాదు. ఇలా చేయడం వల్ల టీలోని రసాయనిక లక్షణాలు మారి ఆమ్లత్వం పెరగవచ్చు.

రోగనిరోధక శక్తిని పెంచే ఫ్రూట్స్..



వర్షాకాలం రాగానే వాతావరణం చల్లబడి ఎంతో ఆహ్లాదకరంగా మారుతుంది. కానీ, ఇదే సమయంలో గాలిలో మరియు నీటిలో బ్యాక్టీరియా, వైరస్‌ల వ్యాప్తి విపరీతంగా పెరిగిపోతుంది. వానాకాలంలో మన శరీరంలో రోగనిరోధక శక్తి సహజంగానే కాస్త మందగిస్తుంది. దీనివల్ల డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, జలుబు, దగ్గు వంటి సీజనల్ వ్యాధులు మనల్ని సులభంగా అటాక్ చేస్తూ ఉంటాయి. ప్రకృతి మనకు ఆయా సీజన్లలో వచ్చే వ్యాధుల నుండి తట్టుకోవడానికి వీలుగా కొన్ని ప్రత్యేకమైన పండ్లను ప్రసాదించింది. వర్షాకాలంలో లభించే కొన్ని రకాల పండ్లను రోజూ తీసుకోవడం వల్ల ఇన్ఫెక్షన్ల బారిన పడకుండా మనల్ని మనం కాపాడుకోవచ్చు. మరి ఈ మాన్సూన్ సీజన్‌లో మనం ఖచ్చితంగా తినాల్సిన ఆ ఆరోగ్యకరమైన పండ్లు ఏంటో, వాటి వల్ల కలిగే లాభాలేంటో ఇప్పుడు పూర్తి వివరంగా తెలుసుకుందాం.

వర్షాకాలంలో లభించే అత్యంత పవర్‌ఫుల్ పండు నేరేడు. ఇందులో ఐరన్, ఫోలేట్, పొటాషియం మరియు విటమిన్ సి పుష్కలంగా ఉంటాయి. ఇది రక్తహీనతను తగ్గించడమే కాకుండా, వర్షాకాలంలో వచ్చే పొట్ట ఇన్ఫెక్షన్లు మరియు డయేరియా సమస్యలను నివారిస్తుంది.

జాజికాయ నీరులో అద్భుతమైన ప్రయోజనాలు!



మన వంటగదిలో ఉండే సుగంధ ద్రవ్యాలు కేవలం ఆహారానికి రుచి, సువాసనను అందించడానికే కాకుండా, ఆరోగ్యానికి పట్టుకొమ్మలుగా పనిచేస్తాయి. భారతీయ సాంప్రదాయ వైద్య విధానమైన ఆయుర్వేదంలో శతాబ్దాలుగా అనేక తీవ్రమైన వ్యాధుల నివారణకు ఈ ద్రవ్యాలను ఉపయోగిస్తున్నారు. జాజికాయ నీటిని అంటే జాజికాయ పొడి కలిపిన నీరు తీసుకోవడం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం అద్భుతంగా మెరుగుపడుతుందని ఆరోగ్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు. పోషకాల గని – జాజికాయ: జాజికాయలో సహజసిద్ధమైన యాంటీ బయోటిక్ గుణాలు ఉంటాయి. ఇందులో శరీరానికి అవసరమైన కాల్షియం, మెగ్నీషియం, జింక్, ఐరన్, కాపర్ వంటి ఖనిజ లవణాలు సమృద్ధిగా లభిస్తాయి. ఇన్ని పోషకాలున్న ఈ నీటిని క్రమం తప్పకుండా తాగడం వల్ల కలిగే ప్రధాన ప్రయోజనాలు. జీర్ణ సమస్యలకు శాశ్వత పరిష్కారం: జాజికాయలో ఉండే యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్ లక్షణాలు కడుపు ఇన్ఫెక్షన్లను దూరం చేస్తాయి. జీర్ణక్రియను వేగవంతం చేసి, నేటి కాలంలో చాలామందిని వేధించే మలబద్ధకం, గ్యాస్, ఎసిడిటీ వంటి సమస్యల నుండి ఉపశమనం కలిగిస్తాయి.

ఒకే ఒక్క సినిమా నా జీవితాన్ని మార్చేసింది..



కోలీవుడ్‌లో నటిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటోంది యంగ్ అండ్ టాలెంటెడ్ బ్యూటీ అనిష్మా అనిల్ కుమార్. 'యూత్', 'సిరాయ్' వంటి సినిమాలతో మంచి పాపులారిటీ సంపాదించుకున్న ఈ అమ్మడు, ప్రస్తుతం దర్శకుడు అమీర్ కాంబినేషన్‌లో 'మకాలి' అనే చిత్రంలో నటిస్తోంది. తండ్రీకూతుళ్ల మధ్య ఉండే బలమైన అనుబంధం, ఎమోషన్స్ నేపథ్యంలో రూపుదిద్దుకుంటున్న ఈ సినిమా పూజా కార్యక్రమాలు ఇటీవల పూర్తి కాగా, త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. ఇదిలా ఉంటే.. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న అనిష్మా, తన చిన్ననాటి జ్ఞాపకాలను షేర్ చేసుకుంటూ తమిళ భాషపై ఉన్న ప్రేమను బయటపెట్టారు. చిన్నప్పుడు వాళ్ల అమ్మ వేరే జిల్లాలో ఉద్యోగం చేయడం వల్ల ఇంట్లో తండ్రీకూతుళ్లు ఇద్దరే ఉండేవాళ్లమని, అర్ధరాత్రి దాటిన తర్వాత రాత్రి 2 గంటల సమయంలో నాన్నతో కలిసి సినిమాలు చూసేదాన్ని అని తెలిపారు.

అలా విజయ్ నటించిన 'గిల్లి', 'అళగియ తమిళ్ మగన్' వంటి సినిమాలు చూడటం, తమిళ పాటలు వినడం వల్ల ఆ భాషపై బాగా ఆసక్తి పెరిగిందని వెల్లడించారు. అలా సినిమాలు చూస్తూ చూస్తూనే తాను ఒకటో తరగతిలోనే తమిళం చదవడం, రాయడం నేర్చుకున్నానని తెలిపారు. 'అళగియ తమిళ్ మగన్' సినిమాలో ఒక క్యారెక్టర్ తన పేరు గురు, స్వస్థలం గురువాయూర్ అని చెప్పే సీన్ ఉంటుందని గుర్తుచేశారు. దాంతో ఇన్స్పైర్ అయి తాను కూడా తన స్వస్థలం 'కట్టకడై' అని రాయడం ప్రాక్టీస్ చేశానని చెప్పారు. సినిమా తన జీవితాన్నే మార్చేసిందని.. ఒక భాషపై అమితమైన ప్రేమ కలిగిందని, దాని వల్లే తనకు తమిళం అంటే ఎంతో ఇష్టం ఏర్పడిందని తెలిపారు. ఇప్పుడు ఆ భాష నిజంగానే తన లైఫ్‌లో ఒక పార్ట్ అయిపోయిందని ఆనందం వ్యక్తం చేశారు.

షూటింగ్ కంప్లీట్ చేసుకున్న అనన్య నాగళ్ల 'లీసా'



విలక్షణమైన పాత్రలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యంగ్ బ్యూటీ అనన్య నాగళ్ల ప్రధాన పాత్రలో నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'లీసా'. ఓం సాయిరామ్ ఆర్ట్స్, ఐరాస్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకాలపై వెంకట్ దుగ్గిరెడ్డి, రామకృష్ణ ఐల సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ మూవీతో జవహర్ పవార్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. భారతీయ చిత్ర పరిశ్రమలో ఇప్పటివరకు రాని విధంగా రెండు భిన్నమైన జోనర్లను సరికొత్త పద్ధతిలో మేళవించి రూపొందిస్తున్న ఈ సినిమాకు 'ఎస్సార్ కళ్యాణమండపం' దర్శకుడు శ్రీధర్ గాదె ఎడిటర్‌గా పనిచేస్తున్నారు. అంతే కాకుండా.. ఈ సినిమాకు 'మెలోడీ బ్రహ్మ' మణిశర్మ సంగీతం అందించడం విశేషం. ఇదిలా ఉంటే.. ఇటీవలే 'లీసా' షూటింగ్ విజయవంతంగా పూర్తి కాగా.. సినిమా రిలీజ్‌పై అప్డేట్ ఇచ్చారు మేకర్స్. 'మా సినిమా చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. చూసిన రషెస్ అందరినీ ఎంతగానో ఆకట్టుకున్నాయి, చిత్ర బృందం మొత్తం ఔట్‌పుట్ పట్ల ఎంతో నమ్మకంతో ఉంది. ఇది ప్రేక్షకులను తప్పకుండా అలరిస్తుంది.

సినిమా మేకింగ్, అనన్య నాగళ్ల అద్భుతమైన నటన ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి. అన్ని కార్యక్రమాలను పూర్తి చేసుకుని నవంబర్ నెలలో సినిమాను ఘనంగా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం' అని చెప్పుకొచ్చారు.

టాలీవుడ్ ఇండస్ట్రీకి ఎంట్రీ ఇవ్వబోతున్న 'ప్రేమలు' బ్యూటీ



'ప్రేమలు' సినిమాతో ఓవర్ నైట్ స్టార్‌గా మారి అన్ని ఇండస్ట్రీల్లో విపరీతమైన క్రేజ్ సంపాదించుకుంది యంగ్ బ్యూటీ మమితా బైజు. ఈ మలయాళ ముద్దుగుమ్మ తన క్యూట్ లుక్స్, యాక్టింగ్‌తో కుర్రకారు హృదయాలను కొల్లగొట్టింది. ఆ తర్వాత తమిళంలో వరుసగా ఆఫర్లు దక్కించుకోవడమే కాకుండా బ్యాక్ టు బ్యాక్ హిట్స్ తన ఖాతాలో వేసుకుంటూ ఫుల్ ఫామ్‌లో దూసుకుపోతోంది. ఇటీవల ఈ అమ్మడు నటించిన విశ్వనాథ్ అండ్ సన్స్, జన నాయగన్, బెత్లెహెం కుటుంబ యూనిట్ వంటి చిత్రాలు బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని సాధించి సరికొత్త రికార్డులు సృష్టించాయి. ఇలా వరుస విజయాలతో తమిళంలో సెన్సేషన్ క్రియేట్ చేస్తున్న మమిత, తెలుగు సినిమాతో టాలీవుడ్‌కి ఎంట్రీ ఇవ్వడానికి సిద్ధమవుతున్నట్లు సోషల్ మీడియాలో పలు పోస్టులు వైరల్ అవుతున్నాయి.

అదీ కూడా తన మొదటి తెలుగు సినిమాలోనే ఏకంగా సూపర్ స్టార్ మహేష్ బాబు సరసన నటించే అవకాశాన్ని దక్కించుకుందనే వార్త ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. ప్రస్తుతం 'వారణాసి' షూటింగ్‌లో బిజీగా ఉన్న మహేష్ బాబు.. తన తదుపరి అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఓ ప్రాజెక్ట్ చేస్తున్నట్లు సమాచారం. ఈ సినిమాలో మమితను హీరోయిన్‌గా ఎంపిక చేసే ప్లాన్‌లో మేకర్స్ ఉన్నట్లు టాక్. ఒకవేళ ఇదే నిజమైతే మమితా బైజు కెరీర్‌కి తెలుగులో ఇది ఊహించని బిగ్ ఆఫర్ అని చెప్పవచ్చు. సూపర్ స్టార్ పక్కన నటిస్తే టాలీవుడ్‌లో టాప్ హీరోయిన్‌గా స్థిరపడటం ఖాయమని ఫ్యాన్స్ భావిస్తున్నారు. ప్రస్తుతం వైరల్ అవుతున్న ఈ క్రేజీ కాంబినేషన్ న్యూస్ విన్న మహేష్ ఫ్యాన్స్, మూవీ లవర్స్ మాత్రం ఎగ్జైట్‌మెంట్‌తో ఈ కాంబో ఓకే అయితే బాగుండు అని కోరుకుంటున్నారు.

మాతోపాటు మీరు ఎంజాయ్ చేస్తారు.....



రాజ్ తరుణ్ హీరోగా నటిస్తున్న కొత్త సినిమా 'టార్టాయిస్'. అమృత చౌదరి, అవసరాల శ్రీనివాస్, ధన్య బాలకృష్ణ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ మూవీని ఎస్ కే గోల్డెన్ ఆర్ట్స్, ప్రశ్వీత ఎంటర్టైన్మెంట్, ఎన్ వీ ఎల్ క్రియేషన్స్ బ్యానర్స్‌పై విజయ్ చౌదరి, శశిధర్ నల్ల, రామిశెట్టి రాంబాబు నిర్మిస్తున్నారు. సస్పెన్స్, డ్రామా కలిసిన ఇంటెన్స్ యాక్షన్ థ్రిల్లర్ కథతో దర్శకుడు రిత్విక్ కుమార్ రూపొందిస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి వచ్చిన ఫస్ట్ లుక్ పోస్టర్ అందరి దృష్టినీ ఆకర్షించగా.. తాజాగా 'నీ పరిచయం..' పాటను గ్రాండ్‌గా రిలీజ్ చేశారు.

Edited, Printed, Published & Owned by PUSALA SRINIVAS, Printed at D.K. Publications,2-3-691/1/A CPL Main Road, Amberpet, Hyderabad and Published # Do.No. 2-2-1075/20/E/1, Opp. Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13. Editor : PUSALA SRINIVAS, RNI. NO. APTEL/2008/26737. Cell: 9603754136, 9949653944 E-mail: dkchaatimpu80@gmail.com